ప్రజాశక్తి

ఆదివారం 4 మే 2025

8 పేజీలు

విశాఖపట్నం అనకాపల్లి






వెయ్యికి ఎకరా

◆ టిడిపి కార్యాలయానికి రెండెకరాలు కేటాయింపు

◆ ప్రభు భక్తిని చాటుకున్న కలెక్టర్ విజయకృష్ణన్

◆ 33 ఏళ్ల పాటు లీజు ◆ చకచకా కదిలిన ఫైల్

◆ వంతపలికిన ఆర్‌డిఒ, తహశీల్దార్



File No.REV02-LM/1337/2022-DT-LA-ANKP

Computer No.12468/2022/L2/Dt: 28/04/2025 Collector's Office, Anakapalli.

PROCEEDINGS OF THE DISTRICT COLLECTOR, ANAKAPALLI
PRESENT: SMT. VIJAYA KRISHNAN, I.A.S.,
@@@

Sub : Lands – Anakapalli District & Division – Anakapalli Mandal – Kothuru H/o Thummapala Village – Allotment of Government Land admeasuring an extent of Ac.2.00cts in Sy.No.608/10 to Telugudesam Party for the purpose of District Telugudesam Party Office Building, Anakapalli on lease –Pending land allotment orders from the Govt. Advance possession given - Orders issued- Regarding.

Read 1. Representation dt:22/07/2024 of Shri Bathula Thatayya Babu, Hon'ble Chairman, AP State Housing Corporation Ltd, Anakapalli and District President, Telugudesam Party, Anakapalli District.
2. Comp No:12468/2022/L1/Dt:08/01/2025 of District Collector, Anakapalli.
3. Rc.No.141/2025/SA/Dated: 24/04/2025 of the Tahsildar, Anakapalli.
4. Rc.No.646/2025/B, dt.24.04.2025 of the RDO, Anakapalli.
@@@

ORDER:
In the reference 1st read above, Shri Bathula Thatayya Babu, District President, Telugudesam Party, Anakapalli has submitted memorandum duly requesting for allotment of Government land measuring an extent of Ac.2.00 cts in Anakapalli mandal on lease basis for the purpose of TDP Party Office Building in-terms of G.O.Ms.No.340, Rev (Assn.I) Dept Dated 21/07/2016.

The Tahsildar, Anakapalli and the RDO, Anakapalli have submitted feasibility reports vide references 3rd & 4th read above respectively for the Govt. land measuring Ac.2.00 Cts in Sy.No.608-10 of Kothuru H/o Thummapala Village of Anakapalli mandal, which is stand classified as "Poramboke", free from encumbrance and suitable for allotment to the TDP Party for the purpose of construction of District Party Office Building as stated below:

టిడిపి కార్యాలయానికి భూమిని కేటాయిస్తూ కలెక్టర్ విజయకృష్ణన్ విడుదల చేసిన ఉత్తర్వులు

ప్రజాశక్తి – అనకాపల్లి ప్రతినిధి

తెలుగుదేశం పార్టీ జిల్లా కార్యాలయానికి రెండెకరాల భూమిని కేటాయించి కూటమి ప్రభుత్వంపై తనకున్న అభిమానాన్ని కలెక్టర్ విజయకృష్ణన్ చాటుకున్నారు. తుమ్మపాల సర్వే నెంబర్ 608/10లో కోట్ల విలువైన పోరంబోకు భూమి రెండెకరాలను ఏడాదికి ఎకరా వెయ్యి రూపాయల చొప్పన 33 సంవత్సరాలకు లీజుకు ఇస్తూ గత నెల 28న ఉత్తర్వులు జారీచేశారు. మంత్రివర్గ ఆమోదానికి పెడితే వివాదాస్పద మవుతుందని అడ్డదారిలో టిడిపి స్థలం పొందింది. జిల్లాలో కూటమి ఎమ్మెల్యేలు, ఎంపీ మెప్పు పొందడానికి రెండెకరాలు బహుమతిగా ఇచ్చారు. దీనికి ప్రతిగా తాము చెప్పినట్లు వింటున్న కలెక్టర్ విజయకృష్ణన్ భర్త అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్‌గా పనిచేస్తున్న దినేష్‌కుమార్‌ను జివిఎంసి కమిషనర్‌గా తీసుకురానున్నట్లు తెలుస్తోంది.

ప్రజల ఆస్తులు అప్పనంగా ప్రయివేటు వ్యక్తులు, పార్టీలకు కేటాయించకూడదన్న నిబంధనలను పక్కన బెట్టి కూటమి ప్రభుత్వం, నాయకులను సంతృప్తి పర్చేందుకు అధికార దుర్వినియోగానికి పాల్పడ్డారు. ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చిన ప్రజలకు సంబంధించిన రెవెన్యూ సమస్యల పట్ల చూపని శ్రద్ధ టిడిపి జిల్లా పార్టీకి భూమి కేటాయించడంపై కనబర్చారు. ఎపి రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్, టిడిపి జిల్లా అధ్యక్షులు బత్తుల తాతయ్యబాబు 2024 జులై 22న చేసిన దరఖాస్తును అనుసరించి రెండెకరాలు కేటాయించినట్లు కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు.

సాధారణ ఎన్నికల ఫలితాలు 2024 జూన్ 4న వచ్చాయి. అదే నెల 12న కూటమి ప్రభుత్వం ఏర్పడింది. ప్రభుత్వం ఏర్పడిన 40 రోజులకు పార్టీ కార్యాలయ భవనం కోసం కలెక్టర్ విజయకృష్ణన్‌కు తాతయ్యబాబు దరఖాస్తు చేశారు. స్థల పరిశీలనపై 2025 జనవరి 8న కలెక్టర్ కిందికి ఆదేశాలు ఇచ్చారు. స్థల పరిశీలనలో జరిగిన జాప్యంతో పై నుంచి వచ్చిన ఒత్తిడితో ఆగమేఘాలపై 2025 ఏప్రిల్ 24న ఒకేరోజు అనకాపల్లి తహశీల్దార్, అనకాపల్లి ఆర్‌డిఒ ఆయిషా తమ పని పూర్తిచేశారు. నాలుగు రోజుల వ్యవధిలో ఏప్రిల్ 28న తుమ్మపాల సర్వే నెంబర్ 608/10లో రెండెకరాల పోరంబోకు భూమిని, ఏడాదికి ఎకరాకు వెయ్యి రూపాయల లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేశారు. మార్కెట్ విలువ ప్రకారం ఎకరా రెండు కోట్లు పైబడివుంది. ప్రయివేటు విలువ పది కోట్లకు మించివుంది. అయినా కలెక్టర్ వాస్తవ ధరలను పరిగణనలోకి తీసుకోకుండా ఎకరా వెయ్యి రూపాయల చొప్పున 33 ఏళ్లపాటు లీజుకు కేటాయించారు. ప్రజల ఆస్తిని టిడిపి కార్యాలయానికి కారుచౌకగా కట్టబెట్టిన కలెక్టర్ చర్యను మిగతా 2లో..



కేసు వివరాలు వెల్లడిస్తున్న సిపి శంఖబ్రత బాగ్చీ

బంగారు గొలుసు కోసమే

దంపతుల హత్య

◆ దువ్వాడ జంట హత్యల కేసును ఛేదించిన పోలీసులు

◆ నిందితుడు అరెస్ట్

ప్రజాశక్తి – ఎంవిపి కాలనీ : దువ్వాడ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రాజీవ్ నగర్ కాలనీలో జంట హత్యల కేసును పోలీసులు ఛేదించారు. నిందితుడు ప్రసన్నకుమార్ మిశ్రాను అరెస్టు చేశారు. గత నెల 25న సాయంత్రం జరిగిన నేరానికి సంబంధించి శనివారం నగర పోలీస్ కమిషనరేట్‌లో సిపి డాక్టర్ శంఖబ్రత బాగ్చీ మీడియా సమావేశంలో వెల్లడించిన వివరాలివీ.. గత నెల 25న సాయంత్రం సుమారు 7 గంటల సమయంలో దువ్వాడ, రాజీవ్‌నగర్ కాలనీలో గంపల యోగేంద్ర బాబు (66), గంపల లక్ష్మి (58) దంపతులు దారుణహత్యకు గురయ్యారు. 112కు వచ్చిన కాల్ మేరకు మిగతా 2లో..

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

▶ వార్త 6లో..

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

▶ వార్త 5లో..

అపారిశుధ్యంపై ఆగ్రహం

▶ వార్త 5లో..



నక్కపల్లిలో మోటమర్రి సత్రం భవనంపై పడిన చెట్టు

ఈదురు గాలులతో


వర్ష బీభత్సం

నేలకొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు వార్త 8లో..

బాధ్యతారాహిత్యం

ప్రజాశక్తి – అనకాపల్లి ప్రతినిధి

ప్రకృతి విపత్తుల విధ్వంసం కంటే మానవ వైఫల్యం, బాధ్యతారాహిత్యంతో ఎక్కువ వినాశనం చోటుచేసుకుంటోంది. ప్రతీ వినాశనం, విధ్వంసం వెనుక నాగరిక సమాజంలో ఆనాగరిక ఆలోచనల సమూహం ఆ విధ్వంస బాహ్యరూపం బయటపడకుండా దాచిపెడుతుంది. అది ఏ ప్రమాదమైనా దానికి ఓ బలమైన కారణం చెప్పి తమ తప్పిదంకాదని తప్పించుకోగలిగిన అమానవీయ నేర్పరితనం, నైపుణ్యాలు ప్రదర్శిస్తుంటారు. సంఘటన తీవ్రత, బాధిత కుటుంబాలు, సమాజ స్పందనను బట్టి రాజకీయ సమయస్ఫూర్తితో ఎక్స్‌గ్రేషియా ప్రకటిస్తున్నారు. ఒక కుటుంబంలో ఆ మనిషి అవసరం, ఆత్మీయత, అనుబంధం, ప్రేమ ఎక్స్‌గ్రేషియా ఇవ్వలేదని మానవీయ హృదయమున్న వారికి తెలిసినంతగా మరొకరికి తెలీదు. వీరు ఏ ప్రమాదానికీ బాధ్యత వహించరు. పునరావృతం కాకుండా చర్యలు చేపట్టరు. ఎదుటవారిపైకో, ప్రకృతిపైకో నెపంనెట్టి జారుకుంటారు. విశాఖ నగరంలోని ఎల్‌జి పాలిమర్స్, అనకాపల్లి జిల్లాలోని అసెన్షియా ఫార్మా ప్రమాదం, తాజాగా విశాఖలోని సింహాద్రి అప్పన్న చందనోత్సవంలో రక్షణగోడ కూలిన



ప్రమాదం ఇవన్నీ బాధ్యత కల్గిన నిర్వాహకుల నిర్లక్ష్యం, వైఫల్యం, తప్పిదాల మూలంగా జరిగిన ఘోరాలే.

చందనోత్సవంలో నాణ్యతతో రక్షణగోడ కట్టేందుకు గడువు ఇవ్వకుండా ఒత్తిడి తెచ్చి కట్టించిన వారి నుంచి లోపం గుర్తించని వారి వరకు, భక్తుల రద్దీని గుర్తించి తగిన సౌకర్యాలు, భద్రత కల్పించని నిర్వాహకుల ప్రతి ఒక్కరిపైనా చర్య తీసుకోవాలి. ప్రమాద ఘటనకు పరిమితం కాకుండా అది జరగడానికి దారితీసిన పరిస్థితులను క్షుణ్ణంగా అధ్యయనంచేసి బాధ్యులపై కఠినంగా వ్యవహరించినప్పుడే విచారణకు సార్థకత వుంటుంది. ప్రమాదాలపై రాజకీయాలు చేయకుండా బాధ్యత వహించి తమ పదవులకు రాజీనామా చేస్తే కొద్దిపాటి గౌరవమైనా మిగులుతుంది. తమ పదవులు, హోదాలూ కావాల్సిన వారికి చందనోత్సవ ఉచిత పాస్‌లు ఇవ్వడానికి కాదని గుర్తించి తప్పుకోవాలి. స్వీయ, కార్పొరేట్ వ్యాపారుల ప్రయోజనాలకు సామాజిక విధ్వంసానికి ప్రభుత్వాలు పాల్పడుతున్నాయి. అదానీకి చెందిన రైవాడ ఓపెన్ లూప్ పంప్డ్ స్టోరేజ్ పవర్ ప్రాజెక్టుకు కూటమి ప్రభుత్వం మిగతా 2లో..

మొదటి పేజీ తరువాయి..

వెయ్యికి ఎకరా

తెలుగు రాష్ట్రాల పబ్లిక్ ఫోరం కో - ఆర్డినేటర్ కాండ్రేగుల వెంకటరమణ తప్పుబట్టారు.

రెండెకరాల భూమి టిడిపి కార్యాలయ భవనానికి 33 ఏళ్లపాటు లీజుకు కేటాయిస్తూ ఉత్తర్వులు జారీచేసి ప్రభుత్వం పట్ల తన భక్తిని ప్రదర్శించుకున్నారు. జిల్లా పార్టీ కార్యాలయానికి దరఖాస్తు చేసినప్పటి నుంచి కేటాయింపు వరకు జరిగిన ప్రక్రియంతా విస్తుపోయేలా వుంది. 2024 సెప్టెంబరు 24న తాతయ్యబాబును రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్‌గా ప్రభుత్వం ప్రకటించింది. అక్టోబర్ 10న ఆయన బాధ్యతలు స్వీకరించారు. కానీ, 2025 ఏప్రిల్‌లో పార్టీ కార్యాలయం కోసం దరఖాస్తు చేసేనాటికి తాతయ్యబాబు రాష్ట్ర గృహ నిర్మాణ సంస్థ ఛైర్మన్ కానప్పటికీ ఛైర్మన్‌గా కలెక్టర్ తన ఉత్తర్వులో పేర్కొన్నారు. భూముల కేటాయింపు విషయమై కలెక్టర్ వివరణ కోసం 'ప్రజాశక్తి' ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

భూ కేటాయింపుపై దర్యాప్తు చేయాలి



నగర, పంచాయతీ పరిధిలోని పోరంబోకు వంటి ప్రభుత్వ భూములను ప్రైవేట్ సంస్థలకు కేటాయింపును నిషేధిస్తూ 2012లో జగపాల్ సింగ్ కేసులో సుప్రీంకోర్టు కీలక తీర్పు ఇచ్చింది. ఈ తీర్పు అన్ని రాష్ట్రాల్లో అమలుచేయాలని ఆదేశించింది. టిడిపి కార్యాలయానికి ప్రభుత్వ భూమిని కేటాయించడం కోర్టు ఆదేశాలను ఉల్లంఘించడమే. 2012లో ప్రభుత్వం ఆమోదించిన ప్రభుత్వ భూముల కేటాయింపు విధాన ప్రకారం ప్రభుత్వ భూములను ప్రైవేటు సంస్థలకు ఇవ్వకూడదు. అసాధారణ పరిస్థితుల్లో, ప్రజా ప్రయోజనాల రీత్యా ఇవ్వాల్సివస్తే భూమి మార్కెట్ ధరపై 10 శాతం కంటే అద్దె తక్కువ ఉండకూడదు. రిజిస్ట్రేషన్ విభాగం వెబ్‌సైట్ ప్రకారం తుమ్మపాలలో ఎకరా కోటికి పైగావుంది. పార్టీ కార్యాలయానికి భూమి కేటాయిస్తూ కలెక్టర్ జారీచేసిన ఉత్తర్వు అనుచితం. ఇవ్వకూడని ఉత్తర్వు ఎలా ఇచ్చారో నిష్పాక్షికంగా దర్యాప్తు చేయాలి. ప్రభుత్వ భూముల విషయంలో, ప్రజల తరపున ప్రభుత్వం ట్రస్టీ అనే విషయాన్ని విస్మరిస్తూ, జమిందార్‌గా ప్రభుత్వాలు వ్యవహరిస్తున్నాయి.

- ఇఎఎస్.శర్మ, విశ్రాంత ఐఎఎస్ అధికారి

బంగారు గొలుసు కోసమే దంపతుల హత్య

దువ్వాడ సిఐ సిబ్బందితో స్థలానికి చేరుకొని, పరిశీలించగా, రక్తపు మడుగులో మృతి చెందిన దంపతులు కనిపించారు. క్లూస్ టీం సాయంతో ఆధారాలు సేకరించారు. కేసు దర్యాప్తులో భాగంగా మృతుల కాల్ డేటాను పరిశీలించగా అందులోని ఒక నెంబరు డిలీట్ చేసి ఉండడాన్ని గమనించారు. దాని ఆధారంగా విచారణ చేపట్టిన పోలీసులు నిందితుడు ప్రసన్నకుమార్ భార్య రాణి శర్మదిగా గుర్తించారు. దీనిపై ఆమెను ప్రశ్నించగా తన భర్త ప్రసన్న కుమార్ మిశ్రా ఆ నెంబర్ వాడుతున్నాడని తెలిపింది. వెంటనే ప్రసన్నకుమార్ మిశ్రా కోసం గాలింపు చేపట్టగా, అతని వాహనం రైల్వే స్టేషన్ పార్కింగ్‌లో ఉన్నట్లు సిసి టివి ఫుటేజీ ఆధారంగా గుర్తించి అతడు పరారైనట్లు నిర్ధారించారు. ప్రత్యేక బృందాలతో గాలించారు. ఒడిశా పూరీలో శుక్రవారం రాత్రి అతడిని అరెస్ట్ చేశారు.

నిందితుడిని విచారించగా మృతురాలు గంపల లక్ష్మి వద్ద రూ.5 వేలు అప్పు తీసుకున్న నిందితుడు దాన్ని తిరిగి చెల్లించేందుకు వారి ఇంటికి వెళ్లగా, లక్ష్మి మెడలోనున్న బంగారు గొలుసు చూసి, దాన్ని అమ్మితే తన అప్పులు తీరిపోతాయని భావించి దొంగలించే ప్రయత్నం చేసినట్టు సిపి తెలిపారు. ఆ క్రమంలో యోగేంద్రబాబు అడ్డుకోవడంతో వారి మధ్య జరిగిన ఘర్షణలో దంపతులిద్దరినీ హతమార్చినట్లు నిందితుడు ఒప్పుకున్నాడని వెల్లడించారు. నిందితుని వద్ద మృతురాలి బంగారు గొలుసు అమ్మగా వచ్చిన సొమ్ములో మిగిలిన రూ. 4,18,400 సొత్తును రికవరీ చేశామన్నారు. కేసును ఛేదించేందుకు 15 మంది సిఐలు, వంద మంది సిబ్బంది పది బృందాలుగా కృషి చేశాయన్నారు. నిందితుడు గతంలోనూ దుబాయిలో చోరీకి పాల్పడి, ఐదేళ్ల జైలుశిక్ష అనుభవించాడన్నారు. రూ.ఐదు లక్షల అప్పులు తీర్చడానికే ఈ దారుణానికి పాల్పడ్డాడని సిపి వివరించారు.

బాధ్యతారాహిత్యం

కొనసాగిస్తున్న అనుమతులతో రైవాడ ఆయకట్టు, జివిఎంసి ప్రజలకు తాగునీటి సౌకర్యం పోతుందని తెలిసినా ఎమ్మెల్యేలు, ఎంపీ మౌనంగా వుండడంతో స్థానిక ప్రజల ప్రయోజనాలను కార్పొరేట్లకు తాకట్టుపెట్టినట్లు భావించాల్సివస్తోంది.

విశ్వదాత అవార్డుకు గంట్ల ఎంపిక

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధులు, అమతాంజనం, ఆంధ్రపత్రిక వ్యవస్థాపకులు దేశోద్ధారక, విశ్వదాత బిరుదాంకితులు కాశీనాధుని నాగేశ్వరరావు పంతులు పేరిట అయన జన్మస్థలం కష్ణాజిల్లా పామర్రు మండలం ఎలకుర్రులోని 'విశ్వదాత కల్చరల్ ఫౌండేషన్ ప్రతిఏటా ప్రధానం చేసే విశ్వదాత అవార్డుకి ఈ ఏడాది జర్నలిజం, సామాజిక సేవారంగంలో విశిష్ట సేవలందించిన విశాఖకు చెందిన సీనియర్ పాత్రికేయుడు, జాతీయ జర్నలిస్టుల సంఘం కార్యదర్శి గంట్ల శ్రీనుబాబు ఎంపికయ్యారు. శనివారం మీడియా సమావేశంలో ఆయన కుటుంబసభ్యులు ఈ మేరకు మాట్లాడుతూ ఎలకుర్రులో ఈ నెల 8 న జరిగే కార్యక్రమంలో గంట్ల శ్రీనుబాబుకు ఈ పురస్కారాన్ని అందిస్తారని ఫౌండేషన్ కార్యదర్శి, నాగేశ్వర రావు పంతులు మనుమడు కాశీనాధుని నాగేశ్వరరావు తెలిపారన్నారు. ఈ అవార్డుకు ఎంపిక కావడంపై పలువురు సీనియర్ జర్నలిస్టులు, పలు జర్నలిస్ట్ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు.

ఆర్‌టిసి కొత్త బస్సులు ప్రారంభం

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : ఎపిఎస్ఆర్‌టిసి కొత్తగా వచ్చిన సూపర్ లగ్జరీ, ఎక్స్‌ప్రెస్ బస్సులను టిడిపి రాష్ట్రఅధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు, ఆర్‌టిసి విజయనగరం జోనల్ ఛైర్మన్ ఎస్.దొన్నుదొర శనివారం విశాఖ స్టీల్ సిటీ డిపోలో వర్చువల్‌గా ప్రారంభించారు. ఆర్‌టిసి ఒకటో జోన్ పరిధిలోనిఅన్ని యూనిట్స్, డిపోలలో సుమారు రూ.30 లక్షల విలువ చేసే 63 కొత్త కంప్యూటర్స్‌ను కూడా ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాబోవు కాలంలో ఆర్‌టిసి మరిన్ని బస్సులను వినయోగంలోకి తెస్తుందన్నారు. కార్యక్రమంలో ఆర్‌టిసి విజయనగరం జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ కెఎస్.బ్రహ్మానంద రెడ్డి, విశాఖపట్నం జిల్లా ప్రజా రవాణాధికారి బి.అప్పలనాయుడు, డిప్యూటీ చీఫ్ ట్రాఫిక్ మేనేజర్ జి.సత్యనారాయణ, విశాఖ స్టీల్‌సిటీ డిపో మేనేజర్ గౌతమ్ ఛటర్జీ, గాజువాక డిపో మేనేజర్ వి.ప్రవీణ, పర్సనల్ ఆఫీసర్ తిరుపతి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ (సివిల్) పివి. నరసింహారావు, అసిస్టెంట్ మేనేజర్స్, అసిస్టెంట్ ఇంజనీర్స్, యూనియన్ ప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

డాల్ఫినోస్ కాలనీలో డిఆర్ఎం పర్యటన



కాలనీలో పర్యటిస్తున్న డిఆర్ఎం లలిత్ బోహ్రా

ప్రజాశక్తి - ఎంవిపి.కాలనీ :డాల్ఫినోస్ వద్ద రైల్వే కాలనీలో వాల్తేరు డివిజన్ డిఆర్ఎం లలిత్‌బోహ్రా ఆకస్మికంగా పర్యటించారు. పారిశుద్ధ్యం, లైటింగ్, భద్రత, రైల్వేక్వార్టర్ల పరిస్థితిని ఆయన సమీక్షించారు. అందుబాటులో ఉన్న ప్రజల వద్ద నుండి అభిప్రాయాలు సేకరించడంతో పాటు కాలనీవాసులతో సమావేశమై వారి సమస్యలు తెలుసుకున్నారు. పలుఇళ్లు తనిఖీ చేసి వారికి కావాల్సిన సదుపాయాలు మెరుగుపరచాలని అధికారులను ఆదేశించారు. రైల్వేకాలనీలో ఎప్పటికప్పుడు ఇలాంటి తనిఖీలు చేపడతామని ఆయన సందర్భంగా తెలిపారు. సీనియర్ డివిజనల్ ఇంజనీర్ జగదీష్ , అసిస్టెంట్ పర్సనల్ అధికారి అప్పారావు, ఎలక్ట్రికల్, సివిల్ ఇంజనీరింగ్ విభాగాల అధికారులు, రైల్వే ట్రేడ్ యూనియన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

ఎన్‌టిఆర్ స్మార్ట్ టౌన్‌షిప్ ప్లాట్లు అప్పగించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: ఆనందపురం మండలం రామవరంలో విఎంఆర్‌డిఎ నగర ప్రజల గృహఅవసరాలను గుర్తించి ఏర్పాటు చేసిన ఎన్టీఆర్ టౌన్‌షిప్‌లో ప్లాట్స్ కోసం డబ్బు చెల్లించిన వారికి, వెంటనే ఫ్లాట్లు అందజేయాలని 2024 ఎన్నికల్లో ఉత్తర నియోజకవర్గం నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసిన చప్ప రామానాయుడు కోరారు. శనివారం విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. 2022 జూన్ 30న రామవరంలో విఎంఆర్ డిఎ ఏర్పాటుచేసిన లేఅవుట్ ఎన్టీఆర్ స్మార్ట్‌టౌన్‌షిప్‌గా చెబుతున్న జగనన్న స్మార్ట్ టౌన్‌షిప్‌లో ప్లాట్ కోసం తాను రూ.2.10లక్షలు ముందస్తుగా చెల్లించానని, అయితే ఇప్పటివరకూ ఫ్లాట్ కేటాయింపు కాలేదన్నారు. దీనిపై పలుమార్లు విఎంఆర్‌డిఎ అధికారులకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా స్పందన లేదని, ప్లాట్ ఇవ్వకపోతే తాను చెల్లించిన డబ్బు తిరిగి ఇవ్వాలని, గతంలో నిర్వహించిన, షాపుల వేలంపై విచారణ జరిపించి నివేదిక ఇవ్వాలని డిమాండ్ చేశారు.

వేసవి దుస్తుల ప్రదర్శన ప్రారంభం



ప్రదర్శనను జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభిస్తున్న సంస్థ ప్రతినిధులు

ప్రజాశక్తి- ఎంవిపి కాలనీ: విశాఖపట్నంలో నోవాటెల్‌హోటల్ వేదికగా మే 3, 4వ తేదీల్లో రెండు రోజుల పాటు నిర్వహించనున్న వేసవి దుస్తుల ప్రదర్శన సూత్ర ఎగ్జిబిషన్ శనివారం ప్రారంభమైంది. ప్రదర్శనను సూత్ర సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ఉమేష్‌మాద్యం, కె.నీలిమ, లక్ష్మీపతి, సునీతదుకార్, రచన సంచిత సంయుక్తంగా ప్రారంభించారు.ఉమేష్ మాద్యం మాట్లాడుతూ వేసవిలో అత్యంత ఉత్సాహాన్ని ఇచ్చేదుస్తులను ఈ ప్రదర్శనలో ఉంచామని వినూత్నమైన డిజైన్లతో ఉన్న వస్త్రాలను ఈ ప్రదర్శనలో ఉంచడం జరుగుతుందన్నారు. సంప్రదాయ, ఫ్యాషన్ దుస్తులు కూడా ఉంటాయని తెలిపారు. ప్రదర్శన ఉదయం 10 గంటల నుండి రాత్రి 9 గంటల వరకు ఉంటుందని ప్రవేశం ఉచితమని తెలిపారు.

గిరిజనులను మభ్యపెడుతున్న వైసిపి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్: జిఒ నంబర్3 విషయంలో వైసిపి నాయకులు గిరిజనులను మభ్యపెడుతున్నారని మాజీ మంత్రి, జిసిసి ఛైర్మన్ కిడారి శ్రావణ్‌కుమార్ ఆరోపించారు. జిల్లా తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో శనివారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. 2020లో జగన్ ప్రభుత్వం వైఫల్యం కారణంగా జిఒ 3 రద్దయిందని దానిగురించి మాట్లాడే నైతికహక్కు వైసిపి నాయకులకు లేదన్నారు. జిఒ275, జిఒ 3 తీసుకువచ్చి గిరిజన ప్రాంతాల అభివద్ధికి కషి చేసింది టిడిపి ప్రభుత్వమే అన్నారు. జిఓ3పై వైసిపి ఎమ్మెల్యేలు అసెంబ్లీలో ఎందుకు మాట్లాడడం లేదని ప్రశ్నించారు.

యువత వ్యాయామంపై శ్రద్ద వహించాలి

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : యువత వ్యాయామంపై శ్రద్ధ చూపాలని ఎమ్మెల్యే వంశీకష్ణ శ్రీనివాస్ అన్నారు. డాబాగార్డెన్స్‌లో శనివారం సాయిసంజీవిని జిమ్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాయామం చేయడంతో శారీరక ఆరోగ్యంతో పాటూ మానసిక ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు, టిడిపి, జనసేన , బిజెపి నాయకులు, జిమ్ నిర్వాహకులు పాల్గొన్నారు.

మొబిల్ అన్‌ఫర్గెటబుల్ టివిసి ఆవిష్కరణ

ప్రజాశక్తి- విశాఖ కలెక్టరేట్ : దేశంలో మొబిల్ బ్రాండెడ్ లూబ్రికెంట్లను మార్కెట్ చేస్తున్న ఎక్సాన్ మొబిల్ అనుబంధ సంస్థ ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ ప్రైవేట్ లిమిటెడ్ 'అన్‌ఫర్గెటబుల్ జర్నీస్' ప్రచారంలో భాగంగా తన కొత్త టివిసిని విశాఖలో ప్రారంభించింది. ఎక్సాన్ మొబిల్ లూబ్రికెంట్స్ డైరెక్టర్ చార్లీ పెరీరా మీడియాతో మాట్లాడుతూ, దశాబ్దాలుగా మొబిల్‌ఆన్ అత్యంత కఠినమైన పరిస్థితులలో ప్రయోగశాలలో పరీక్షించబడి, ,రోడ్డుపై నడిచే, ట్రాక్-నిరూపితమైన పనితీరును నిరూపించిందన్నారు. గణనీయమైన మైలేజ్ తర్వాత ఇంజిన్లు ఇప్పటికీ అద్భుతమైన స్థితిలో ఉన్నాయన్నారు.

ఇచ్ఛాపురంలో క్వారీ మైనింగ్ వద్దు

గ్రామాన్ని సందర్శించిన సిపిఎం బృందం

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం కుసులువాడ పంచాయతీ ఇచ్ఛాపురం గ్రామంలో మైనింగ్ పేరుతో ప్రకృతిని ధ్వంసం చేయడానికి ప్రయత్నిస్తున్న వారిని గ్రామస్తులందరూ ఐక్యంగా తిప్పికొట్టాలని సిపిఎం భీమిలి డివిజన్ కార్యదర్శి ఆర్ఎస్ఎన్.మూర్తి పిలుపునిచ్చారు. ఇచ్ఛాపురం సర్వే నెంబరు 37/పి దెయ్యాల మెట్టపై మైనింగ్ అనుమతిని ఇచ్చారంటూ గత వారం రోజులుగా ప్రైవేట్ వ్యక్తులు కొండ ప్రాంతంలో సర్వేలు నిర్వహించి పనులు ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తున్నట్లు అందిన సమాచారం మేరకు సిపిఎం బృందం గ్రామంలో పర్యటించింది. ఈ సందర్భంగా ఆర్ఎస్ఎన్.మూర్తి మాట్లాడుతూ, పంచాయతీలో ప్రజాభిప్రాయ సేకరణ లేకుండా రహస్యంగా జీవోలు విడుదల చేసి మైనింగ్‌కు మహారాష్ట్ర నాగపూర్‌కు చెందిన అగ్ని సుముఖ్ మార్కెటింగ్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ ఇక్కడ సుమారు 45 ఎకరాల స్థలంలో మైనింగ్‌కు రహస్యంగా ఒప్పందాలను కుదుర్చుకొని పనులు ప్రారంభించడానికి ప్రయత్నాలు చేస్తోందని తెలిపారు. గతంలో ఇదే పంచాయతీ చిన్నయ్య పాలెంలో క్వారీ అను మతులకు ప్రయత్నించగా గ్రామస్తులు ఐక్యంగా తిప్పికొట్టారని, మళ్లీ అదే పంచాయతీ ఇచ్ఛాపురం దళితవాడలో ప్రకృతిని ధ్వంసం చేయడానికి బడాబాబులు ప్రయత్నాలు చేస్తున్నారని వివరించారు. నాలుగు రోజుల క్రితం ప్రైవేట్ వ్యక్తులు డేవిడ్ రాజు బృందం రహస్యంగా సర్వే నిర్వహించిందన్నారు. మైనింగ్ చేస్తే గిరిజనుల జీవనోపాధి అయిన వ్యవసాయం, తోటలు ధ్వంసం అవుతాయని, పర్యావరణం కాలుష్యమవుతుందని తెలిపారు. గిరిజన హక్కులకు భంగం కలిగించే ఎటువంటి పనులైనా ఐక్యంగా తిప్పికొడతామన్నారు. గిరిజనులకు సిపిఎం అండగా నిలుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో ఐద్వా నాయకులు కె.నాగరాణి, పాల్గొన్నారు.



దెయ్యాల మెట్టపై నినదిస్తున్న సిపిఎం నాయకులు, ప్రజలు

నేరాలు ఘోరాలు

12 గంటల వ్యవధిలో హత్య కేసు ఛేదన - నిందితుడు అరెస్టు

ప్రజాశక్తి - ఎంవిపి కాలనీ : భీమిలి పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన మహిళా హత్య కేసును 12 గంటలలోపే ఛేదించి నిందితుడిని అరెస్టు చేసినట్లు నగర్ పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి తెలిపారు. హత్యకు వివాహేతర సంబంధమే కారణమని గుర్తించారు. సిపి వెల్లడించిన వివరాలివి. ఒడిశా రాయగడ ప్రాంతానికి చెందిన క్రాంతికుమార్ తగరపువలస సమీపంలో తన భార్య పిల్లలతో నివాసముంటున్నాడు. అతనికి మారికవలసలో రెండోభార్య ఉంది.. ఈ క్రమంలో రెండో భార్య పక్కింట్లో ఉండే మృతురాలు వెంకటలక్ష్మి (38) తో సన్నిహితంగా మెలిగేవాడు. దీనిపై వివాదం రేగడంతో తన రెండోభార్యను అదే బ్లాక్ లోని మరొక ఇంటికి మార్చి, మృతురాలితో స్నేహ సంబంధాలను కొనసాగించాడు.

ఈనెల ఒకటిన రాత్రి 9గంటల సమయంలో ఫంక్షన్‌కు వెళ్లి వస్తానని ఇంట్లోంచి వచ్చిన మృతురాలితో తెన్నేటి పార్క్, బీచ్ రోడ్డు తదితర ప్రాంతాలకు వెళ్లి తిరిగి, నిందితుడు క్రాంతి కుమార్, రాత్రి ఒంటిగంట సమయంలో దాకమర్రి దరి ఫార్చ్యూన్ లేఅవుట్ ప్రాంతం వద్ద ఆమెను హత్య చేశాడు. ముందస్తుగా హత్యకు ప్లాన్ వేయడంతో మృతురాలి గొంతుకోసి, ఆమె మెడలోని బంగారు పుస్తెలతాడు, జత బంగారు దుద్దులు, రెండు సెల్‌ఫోన్లు, హ్యాండ్ పర్సులను తీసుకొని, సాక్ష్యాలు లేకుండా చేసేందుకు వెంట తెచ్చుకున్న పెట్రోల్‌ను మృతదేహంపై పోసి గుర్తుపట్టకుండా కాల్చి పరారయ్యాడు. కేసు నమోదు చేసిన భీమిలి పోలీసులు ఆరు ప్రత్యేక బృందాలతో గాలింపు చేపట్టి నిందితుడిని అరెస్ట్ చేశారు. కాగా నిందితుడు దివీస్ సంస్థలో ఉద్యోగం చేస్తున్నాడు.

ఉచిత కుట్టు శిక్షణ ప్రారంభం

ప్రజాశక్తి - ఆరిలోవ : బిసి ఫైనాన్స్ కార్పొరేషన్ ఇడబ్ల్యుఎస్ సహకారంతో 11వ వార్డు డ్రైవర్స్ కాలనీ షాదీఖానా భవనంలో శనివారం ఉచిత కుట్టు శిక్షణా శిబిరాన్ని ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 90 రోజుల పాటు శిక్షణకు హాజరై నేర్చుకున్న మహిళలకు ఉచితంగా కుట్టు మిషన్లు ప్రభుత్వం అందిస్తుందని తెలిపారు. ఈ శిక్షణా తరగతులకు 100 శాతం హాజరు కావాలని సూచించారు. కార్యక్రమంలో టిడిపి రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, నాయకులు అచ్యుతరావు, ముగడ రాజారావు, మూది అప్పారావు, పేపర్ నాయుడు, జనసేన నాయకులు సారిపల్లి రాము, సియుఆర్‌డి కో-ఆర్డినేటర్ కిషోర్‌కుమార్, ఎపిడి శ్రీరామ్, సిఒ అరుణ్ కుమార్ పాల్గొన్నారు.

అవగాహన సదస్సుకు విశేష స్పందన



అవగాహన సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు

ప్రజాశక్తి - ఆరిలోవ : జిఒ 296, 388 ప్రకారం గతంలో ఇచ్చిన పట్టాలకు రిజిస్ట్రేషన్ కల్పించేందుకు, కొత్తగా పట్టాలకోసం దరఖాస్తు చేసుకునేందుకు తీసుకోచ్చిన జిఒ 30పై శనివారం తోటగరువు వెర్నిదుర్గమాంబ కల్యాణమండపంలో నిర్వహించిన అవగాహన సదస్సుకు విశేష స్పందన లభించింది. సుమారు 800 మంది హాజరయ్యారు. జిఒ 30పై ఆర్‌డిఒ సంగీత్ మాథుర్, తహశీల్దారు పాల్‌కిరణ్ అవగాహన కల్పించారు. లబ్ధిదారుల సందేహాలను రెవెన్యూ అధికారులు నివృత్తి చేశారు. అనంతరం ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు మాట్లాడుతూ, జిఒ 296, 388 ప్రకారం అప్పట్లో ఇచ్చిన చంద్రన్న పట్టాలకు యాజమాన్యపు హక్కులు కల్పించే విధంగా రిజిస్ట్రేషన్ కోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. సచివాలయ సిబ్బంది మీ ఇంటి వద్దకే వచ్చి దరఖాస్తులు స్వీకరిస్తారని తెలిపారు. జిఒ 30 ప్రకారం కొత్తగా పట్టాలకోసం దరఖాస్తులు చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. అనంతరం కొత్తగా పట్టాలకోసం రెవెన్యూ అధికారులు దరఖాస్తులు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో టిడిపి ఆర్గనైజింగ్ సెక్రటరీ ఒమ్మి సన్యాసిరావు, ఐదు వార్డుల టిడిపి ఇన్‌ఛార్జులు, వార్డు అధ్యక్షులు, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

'ఉపాధి హామీ' మేట్‌లను మార్చాలి - ఎంపిడిఒకు కూలీల వినతి

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం శొంఠ్యాం పంచాయతీ పరిధిలో ఉపాధి హామీ చట్టం మేట్‌లను మార్చాలని కూలీలు శనివారం ఎంపిడిఒకు వినతిపత్రం అందజేశారు. గతంలో పనిచేసిన మేట్‌లు అవినీతిపరులై సక్రమంగా విధులు నిర్వహించ లేదని, వారిని మార్చి కొత్తవారిని నియమించా లని కూలీలు లక్ష్మి, అప్పలనరసమ్మ, రవణమ్మ తదితర 50 మంది కూలీలు కోరారు. కొంతమంది రాజకీయ నాయకులు పాతవారికే ఇవ్వడానికి ప్రయత్నం చేస్తున్నారని, వారిని కొనసాగించవద్దని కోరారు.

ప్రభుత్వ వైఫల్యంతోనే సింహగిరిపై ప్రమాదం

వైసిపి భీమిలి ఇన్‌ఛార్జి మజ్జి శ్రీను

ప్రజాశక్తి -ఆనందపురం : చందనోత్సవంలో సింహగిరిపై గోడ కూలి ఏడుగురు మృతిచెందడంలో ప్రభుత్వ వైఫల్యమే కారణమని భీమిలి నియోజకవర్గ వైసిపి సమన్వయకర్త మజ్జి శ్రీను ఆరోపించారు. వేములవలస జడ్‌పిటిసి కోరాడ వెంకటరావు నివాసం వద్ద శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, చందనోత్సవానికి ఏటా లక్షల మంది భక్తులు వస్తారని తెలిసినా సరైన ఏర్పాట్లు చేయలేదన్నారు. సింహాచలం ఘటనపై బాధ్యత వహించాల్సింది పోయి రాజకీయాలు చేస్తున్నారనడం హాస్యాస్పదమన్నారు. గతంలో ఎల్‌జి పాలిమర్స్ ఘటనలో మృతి చెందిన కుటుంబాలకు జగన్మోహన్‌రెడ్డి రూ.కోటి పరిహారం అందించారని, అదే మాదిరిగి చందనోత్సవంలో మృతిచెందిన కుటుంబాలకు కూడా రూ.కోటి చొప్పున, కుటుంబంలో ఒకరికి ప్రభుత్వ ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్‌చేశారు. ఈ కార్యక్రమంలో ఆనందపురం మండల వైసిపి ప్రెసిడెంట్ బంక సత్యం, జడ్‌పిటిసిలు కోరాడ వెంకటరావు, సుంకర గిరిబాబు, జి.శ్రీనివాసరావు, నాయకులు మజ్జి వెంకట్రావు, చందక సూరిబాబు, బొట్ట రామకృష్ణ, షినగం దాము, రౌతు వెంకట్రావు, కోన శ్రీనివాసరావు, కోరాడ అచ్యుత రాంబాబు, పతివాడ గోపి తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రాలు ఏర్పాటు

ప్రజాశక్తి -గాజువాక : గాజువాక ఆటోనగర్‌లో మజ్జిగ చలివేంద్రాన్ని ఐలా మాజీ చైర్మన్ ఎన్.శేషగిరిరావు శనివారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ప్రస్తుత ఐలా చైర్మన్ కె.సత్యనారాయణ రెడ్డి, సెక్రటరీ చీకటి సత్యనారాయణ, ఉపాధ్యక్షులు కొల్లి ఈశ్వరరావు, ఎన్.పాండురంగప్రసాదరావు, ఐలా మాజీ చైర్మన్ వై.సాంబశివరావు, ఎకె.బాలాజీ, కృష్ణ ప్రసాద్, ప్రశాంత్ కుమార్ పాల్గొన్నారు.

తగరపువలస : భీమిలి మండలం చిప్పాడ దివీస్ సంస్థ ఆధ్వర్యాన స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాల సమీపంలో జాతీయ రహదారికి ఇరువైపులా శనివారం రెండు మజ్జిగ, తాగు నీరు చలివేంద్రాలను ఏర్పాటుచేశారు. జాతీయ రహదారుల శాఖ ఎబిఎల్ సంస్థ నుంచి ఇన్సిడెంట్ మేనేజ్మెంట్ టీమ్ ఎక్జిక్యూటివ్ రామస్వామి చలివేంద్రాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో దివీస్ సిఎస్ఆర్ మేనేజర్ డి.సురేష్‌కుమార్, ప్రతినిధి శేఖర్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

కొండప్ప చెరువు పరిశుభ్రత

ప్రజాశక్తి -తగరపువలస : జివిఎంసి రెండో వార్డు పరిధి సంగివలస అల్లూరి సీతారామరాజు కాలనీకి ఆనుకుని ఉన్న కొండప్ప చెరువును జివిఎంసి ఒకటో జోన్ పారిశుధ్య కార్మికులు శనివారం పరిశుభ్రం చేశారు. వేసవి తాపానికి ఆక్సిజన్ అందక చెరువులో ఉన్న చేపలు కొద్ది రోజుల క్రితం మృత్యువాత పడ్డాయి. చనిపోయిన చేపలు పైకి తేలి దుర్వాసన రావడంతో ఈ సమస్యను కొంత మంది స్థానికులు, టిడిపి నాయకులు భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే స్పందించిన ఆయన చెరువును పరిశీలించి మృతి చెందిన చేపలను, చెరువులో ఉన్న వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని జివిఎంసి ఒకటో జోన్ జోనల్ కమిషనర్ అయ్యప్పనాయుడును ఆదేశించిన మేరకు శనివారం చెరువులో వ్యర్థాలను తొలగించారు. చుట్టూరా బ్లీచింగ్ చల్లి శుభ్ర పరిచారు.

మేయర్‌కు శుభాకాంక్షలు

ప్రజాశక్తి -తగరపువలస : కొత్తగా ఎన్నికైన జివిఎంసి మేయర్ పీలా శ్రీనివాసరావును నగరంలోని అతని నివాసంలో శనివారం జివిఎంసి కో-ఆప్షన్ మెంబర్ కొప్పల ప్రభావతి, పార్టీ నాయకులు కొప్పల రమేష్ కలిసి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు కొప్పల కృష్ణ, మదాబత్తుల త్రినాథ్, చంటి తదితరులు పాల్గొన్నారు.

80 మందికి వైద్య పరీక్షలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : మండలంలోని దాకమర్రిలో శనివారం అనిల్ నీరు కొండ ఆసుపత్రి ఆధ్వర్యాన నిర్వహించిన ఉచిత వైద్య శిబిరంలో 80 మందికి వైద్య పరీక్షలు చేశారు. ఆసుపత్రి వైద్యులు అనూష, రేష్మ, సిబ్బంది జ్ఞానేశ్వర్ కృష్ణ సాధారణ, నేత్ర పరీక్షలు చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి చెల్లూరి నగేష్‌బాబు, కూటమి నాయకులు నాని, గ్రామీణ వైద్య సంఘం ఉత్తరాంధ్ర జోనల్ కార్యదర్శి గెద్ద చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.

అశోక్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభం

ప్రజాశక్తి -గాజువాక : అశోక్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పల్లా శ్రీనివాసరావు మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో తొలిసారిగా అశోక్ చైల్డ్ డెవలప్‌మెంట్ సెంటర్ ప్రారంభించడం శుభపరిణామం అన్నారు. అనంతరం సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ రాహుల్ గల్వే మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్‌లో శరవేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖలో తమ శాఖలను ప్రారంభించామని తెలిపారు. తమ కేంద్రంలో చిన్న పిల్లలకు స్పీచ్‌థెరపీ మ్యానువల్ థెరపీ వంటి శిక్షణ ద్వారా పిల్లల బంగారు భవిష్యత్తును తీర్చిదిద్దడానికి నిపుణులు ఉంటారని తెలిపారు. తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, బాలల శ్రేయోభిలాషులు తమ తోడ్పాటును, సహాయ సహకారాలను అందించాలని కోరారు. మరో వ్యవస్థాపక డైరెక్టర్ కిరణ్ కుమార్ గల్వే మాట్లాడుతూ, తమ వద్ద ఆటిజం, ఎడిఎస్‌డి, లెర్నింగ్, డిజేబులిటీ వంటి సమస్యలు ఉన్న చిన్న పిల్లలు తేడాగా ప్రవర్తిస్తుంటారని, మానసిక ఎదుగుదల లేని పిల్లలకు తమ వద్ద తొమ్మిది నుండి పది రకాల థెరపీలు అందుబాటులో ఉన్నాయని వివరించారు. రానున్న రోజుల్లో ఆంధ్రప్రదేశ్‌లో మరిన్ని శాఖలు ప్రారంభిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సచిన్ కుమార్ గుల్వే, చైల్డ్ సైకాలజిస్ట్ డాక్టర్ నవిత రాహుల్ గుల్వే, స్థానిక కార్పొరేటర్ సుజాత పాల్గొన్నారు.

ఆపరేషన్ థియేటర్ ప్రారంభం

ప్రజాశక్తి -గోపాలపట్నం : గోపాలపట్నంలోని ప్రభుత్వ 30 పడకల ఆసుపత్రిలో కమల్ వెల్ఫేర్ ఫౌండేషన్ సహకారంతో సిఎస్ఆర్ నిధులు సుమారు రూ.11 లక్షలతో ఏర్పాటుచేసిన ఆపరేషన్ థియేటర్‌ను స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ గణబాబు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంత వరకు ఒక ఆపరేషన్ థియేటర్ ఉండేదని, ఇప్పుడు మరొకటి ఏర్పాటు చేసుకోవడం ద్వారా ఎమర్జెన్సీ సేవలో ఉపయోగపడుతుందని అభిప్రాయపడ్డారు. హాస్పిటల్‌కు ఎక్కువగా ఓపీలు నమోదు కావడం, బాలింతలు సంఖ్య ఎక్కువగా ఉండడంతో అధునాతన పరికరాలు, సౌకర్యాలతో ఆపరేషన్ థియేటర్ ఏర్పాటుచేసుకున్నట్లు వివరించారు.

అభివృద్ధి పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి-మాధవధార : జివిఎంసి 50వ వార్డు పరిధి సత్యానగర్‌లో రూ.20 లక్షలతో రిటైనింగ్ వాల్ నిర్మాణానికి వార్డు కార్పొరేటర్ వావిలపల్లి ప్రసాద్, వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ శనివారం శంకుస్థాపన చేశారు. గత నెలలో కురిసిన వర్షాలకు సత్యానగర్ కొండవాలు ప్రాంతంలో ఓ ఇంటి గోడ కుంగిపోయింది. ఈ విషయాన్ని వార్డు టిడిపి అధ్యక్షులు సనపల వరప్రసాద్ స్థానిక ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు రిటైనింగ్ వాల్ నిర్మాణానికి నిధులు మంజూరు కావడంతో శనివారం శంకుస్థాపన చేశారు. నాణ్యతా లోపం లేకుండా పనులు చేయాలని నాయకులు కోరారు. ఈ కార్యక్రమంలో జోనల్ కమిషనర్ బొడ్డేపల్లి రాము, కూటమి నాయకులు సంకు వెంకటేశ్వరరావు, మూల వెంకటరావు, అప్పలకొండ యాదవ్, రంధి ఈశ్వరరావు, బంగారయ్య, రామకృష్ణ, మల్లు నాయుడు, ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంతంగా గ్రూప్‌-1 మెయిన్‌ పరీక్షలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం మండలం పాలవలస గ్రామపంచాయతీ గుడిలోవ గ్రామంలో ఉన్న ఏక్యూజే కళాశాలలో శనివారం ఎపిపిఎస్‌సి గ్రూప్‌ 1 మెయిన్‌ పరీక్షలు ప్రశాంతంగా జరిగాయి. ఈ పరీక్షా కేంద్రాన్ని జిల్లా పరిషత్‌ సిఇఒ నారాయణస్వామి పరిశీలించారు. ఏక్యూజే కళాశాలలో 600 మంది పరీక్ష రాయాల్సి ఉండగా 370 మంది హాజరయ్యారని నారాయణ స్వామి తెలిపారు. ఏక్యూజే కళాశాల ముఖ్య సూపరింటెండెంట్‌ డాక్టర్‌ పి.సుధారాణి మాట్లాడుతూ, కళాశాల సెంటర్‌లో ఎటువంటి ఇబ్బందులు లేకుండా ప్రశాంతంగా మెయిన్‌ పరీక్ష జరిగినట్లు తెలిపారు. అభ్యర్థులకు అన్ని సౌకర్యాలూ ఏర్పాటు చేశామన్నారు. విశాఖ జిల్లాలో రెండు సెంటర్లు ఇచ్చారని, ఒకటి మధురవాడ సాంకేతిక కళాశాల, రెండవది గుడిలోవ ఏక్యూజె కళాశాల అని తెలిపారు. ఈ పరీక్షలకు గట్టి పోలీస్‌ బందోబస్తు ఏర్పాటుచేసినట్లు పేర్కొన్నారు.

పలుచోట్ల ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - యంత్రాంగం

విశాఖ కలెక్టరేట్‌ : ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవ వేడుకలు శనివారం జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద జరిగాయి. ముందుగా గాంధీ విగ్రహానికి సంఘం జిల్లా అధ్యక్షులు మంత్రి రాజశేఖర్‌ పూలమాలవేసి నివాళులు అర్పించారు. జిల్లా ప్రధాన కార్యదర్శి భోగవిల్లి నాగ భూషణం, కొండబాబు, తాతబాబు, భాస్కర్‌ పాల్గొన్నారు.

భెల్‌లో...

గాజువాక : భెల్‌లో ఐఎన్‌టియుసి ఆవిర్భావ దినోత్సవం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్‌ సీనియర్‌ నాయకులు వి.బాబూరావు మాట్లాడుతూ, కార్మికుల సమస్యలు, హక్కులపై తమ యూనియన్‌ పోరాడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలకు నిరసనగా ఈనెల 20వ తేదీన చేపట్టే దేశవ్యాప్తంగా సమ్మెను విజయవంతం చేసి, పాలకులకు కనువిప్పు కలిగించాలని కోరారు. భెల్‌లోని సిఐటియు నాయకులు జిటిపి ప్రకాష్‌ మాట్లాడుతూ, భెల్‌లో సిఐటియు, ఐఎన్‌టియుసి కలిపి కార్మిక హక్కుల కోసం, నిరంతరమూ పోరాడుతూ, ఎన్నో ఉపయోగకరమైన పనులు చేశామని తెలిపారు. ఈ కార్యక్రమంలో వి.ఆనందరావు, మురళీశ్వరరావు, పి.ఆనంద్‌కుమార్‌, అల్లు అప్పారావు, ఎస్‌.జగన్నాథరావు పాల్గొన్నారు.

పిఎం.పాలెం ఎస్‌ఐగా రాము

ప్రజాశక్తి -మధురవాడ : పోతిన మల్లయ్యపాలెం ఎస్‌ఐగా డి.రాము బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ స్టేషన్‌ పరిధిలో శాంతి భద్రతల పరిరక్షణకు ప్రజల భాగస్వామ్యంతో కృషిచేస్తానని తెలిపారు.

హోంగార్డు పప్పలకు సత్కారం

ప్రజాశక్తి-మాధవధార : నగర పోలీసు శాఖలో హోంగార్డుగా విధులు నిర్వహించి ఉద్యోగ విరమణ పొందిన పప్పల శ్రీనివాసరావును మాధవదారలోని పలు ఉద్యోగ సంఘాలు, గ్రామస్తులు శనివారం సత్కరించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ, పోలీస్‌ శాఖలో 36 ఏళ్లకుపైగా విధులు చక్కగా నిర్వర్తించడం అభినందనీయమన్నారు. ఉద్యోగ విరమణ తరువాత శేష జీవితం ఆనందంగా సాగిపోవాలని ఆకాంక్షించారు. విధి నిర్వహణలో చూపిన క్రమ శిక్షణ, అంకిత భావమే ఆయనున్న ఉన్నతంగా నిలిపిందని కొనియాడారు. అనంతరం సన్మాన గ్రహీత పప్పల శ్రీనివాసరావు మాట్లాడుతూ, గామస్తులు, ఇతర ఉద్యోగ సంఘాలు నేతలు ఆత్మీయ వీడ్కోలు పలకడం, సత్కరించడం తన జీవితంలో ఎన్నటికీ మరులేనని పేర్కొన్నారు. కార్యక్రమంలో మాధవ సమాజం కన్వీనర్‌ సనపల రామ్‌గోపాల్‌, సెక్రటరీ పప్పల రామచంద్రరావు, పోలీస్‌ సిబ్బంది పప్పల వరహానరసింహం, వేద కుమార్‌, ఆంధ్ర యూనివర్సిటీ సిబ్బంది ఈశ్వరరావు, రైల్వే సిబ్బంది గోవిందా, గ్రామస్తులు, స్నేహితులు, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.



పప్పల శ్రీనివాసరావును అభినందిస్తున్న మాధవధార ప్రజలు

ఉత్సాహంగా మేడే వేడుకలు



గీతాలను ఆలపిస్తున్న ప్రజానాట్యమండలి కళాకారులు

ప్రజాశక్తి-యంత్రాంగం

మే డే వేడుకలను నగరంలో పలుచోట్ల ఉత్సాహంగా జరుపుకున్నారు.

ఉక్కునగరం : మే డే వేడుకలను ఉక్కునగరంలోని సిఐటియు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. స్టీల్‌ప్లాంట్‌ ఎంప్లాయీస్‌ యూనియన్‌ (సిఐటియు) ఆధ్వర్యాన జరిగిన మేడే వేడుకల్లో ఏర్పాటుచేసిన సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. ప్రజానాట్యమండలి కళాకారులు విప్లవ గీతాలు ఆలపించారు. నృత్య, కళా ప్రదర్శనలు అలరించాయి. కోలాటం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ముందుగా ఉద్యమ గేయాలతో కార్యక్రమాన్ని ప్రారంభించారు. బాలికలు ఫోక్‌, క్లాసికల్‌ విభాగాలలో అనేక నృత్య రీతులు ప్రదర్శించారు.

ఈ సందర్భంగా 78వ వార్డు సిపిఎం కార్పొరేటర్‌ డాక్టర్‌ బి.గంగారావు మాట్లాడుతూ, కార్మిక శక్తిని ప్రపంచానికి చాటి చెప్పేందుకు మేడే ఒక గొప్ప ఆయుధమని అన్నారు. ఎన్నో పోరాటాలతో సాధించుకున్న మేడే పోరాట ఫలాలను నాలుగు లేబర్‌ కోడ్‌లుగా విభజించి కేంద్ర ప్రభుత్వం ఖూనీ చేయాలని చూస్తోందని విమర్శించారు.

హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలే శరణ్యం : ఆర్‌కెఎస్‌వి.కుమార్‌

తగరపువలస : హక్కుల రక్షణకు ఐక్య పోరాటాలే శరణ్యమని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ కార్మిక వర్గానికి పిలుపునిచ్చారు. సిఐటియు భీమిలి జోన్‌ కమిటీ ఆధ్వర్యాన శనివారం సాయంత్రం చిట్టివలస లేబర్‌ వెల్ఫేర్‌ సెంటర్‌లో మే డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ మాట్లాడుతూ, మే డే స్ఫూర్తితో హక్కుల రక్షణకు ఉధృత పోరాటాలకు సిద్ధం కావాలని కార్మికులకు విజ్ఞప్తి చేశారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్పొరేట్ల ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరిస్తూ కార్మిక వర్గ హక్కులను కాలరాస్తోందని ధ్వజమెత్తారు. ప్రభుత్వ రంగ సంస్థలను కార్పొరేట్లకు కారుచౌకగా కట్టబెడుతోందని విమర్శించారు. దేశ ఆర్థిక వ్యవస్థకు మూల స్తంభాలుగా ఉన్న ప్రభుత్వ రంగ సంస్థలను బిజెపి ప్రభుత్వం ధ్వంసం చేస్తుందని మండిపడ్డారు. ఈ సందర్భంగా ప్రజానాట్యమండలి కళాకారులు పల్లా పోతురాజు, పంపాన సూర్య నారాయణ, దల్లి రాంబాబు తదితరులు విప్లవ గీతాలు ఆలపించారు. చిన్నారుల కోలాటం ప్రదర్శన ఎంతో ఆకట్టుకుంది. సభాస్థలి నుంచి జ్యూట్‌ కార్మిక వాడ మీదుగా జంక్షన్‌ప



మేడే సభలో మాట్లాడుతున్న కుమార్‌

కార్మికులు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్‌ఎస్‌ఎన్‌.మూర్తి, ఎస్‌.అప్పలనాయుడు, ఐద్వా నాయకులు కె.నాగరాణి, నీలాతి రాము తదితరులు పాల్గొన్నారు.

'బిఎన్‌ఆర్‌'లో రక్తదాన శిబిరం



రక్తదానం చేస్తున్న కార్మికులు

విశాఖ కలెక్టరేట్‌ : మేడే సందర్భంగా డిఫెన్స్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ ఆధ్వర్యాన కంచరపాలెం బిఎన్‌ఆర్‌ ట్రస్ట్‌ భవన్‌లో శనివారం రక్తదాన శిబిరం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంఒవి అడ్మిన్‌ ఆఫీసర్‌ డిఎస్‌.మూర్తి హాజరై మాట్లాడుతూ, రక్తదానం మరొకరికి ప్రాణదానం అవుతుందన్నారు. డిఫెన్స్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ రక్తదాన శిబిరాన్ని నిర్వహించడం అభినందనీయన్నారు. డిఫెన్స్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ కన్వీనర్‌, సభాధ్యక్షులు రెడ్డి వెంకట్రావు మాట్లాడుతూ, ఏటా డిఫెన్స్‌ కో-ఆర్డినేషన్‌ కమిటీ ఆధ్వర్యాన 3 సార్లు రక్తదాన శిబిరాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఆర్‌కెఎస్‌వి.కుమార్‌ మాట్లాడుతూ, కార్మికులు ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలపై సిఐటియు నిరంతరం పనిచేస్తూనే సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. కార్మికులు పని ప్రదేశాలలో ప్రమాదాలకు గురై అత్యవసరంగా రక్తం అవసరమైనప్పుడు సిఐటియు నుంచి రక్తం అందిస్తున్నామని తెలిపారు. రక్తదానంలో పాల్గొన్న ప్రతి కార్మికునికీ, ఉద్యోగికీ అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనియన్‌ నాయకులు అరుణ్‌కుమార్‌, శ్రీనివాస్‌, రాజేష్‌, నాగేశ్వరరావు, నాగార్జున, నూకరాజు, పెద్ద సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు.

20 నుంచి స్టీల్‌ప్లాంట్‌ కాంట్రాక్టు కార్మికుల సమ్మె



సమ్మె నోటీసు అందజేస్తున్న కాంట్రాక్టు కార్మికులు

ప్రజాశక్తి-ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్‌ కాంట్రాక్టు కార్మికులు ఈ నెల 20 నుంచి నిరవధిక సమ్మెకు వెళ్లనున్నట్లు ఉక్కు అఖిలపక్ష కాంట్రాక్టు కార్మిక సంఘాలు నిర్ణయించాయి. ఈ మేరకు హెచ్‌ఆర్‌ జిఎం ఎం.మధుసూధన్‌కు సమ్మె నోటీసు అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ, స్టీల్‌ప్లాంట్‌లో కాంట్రాక్టు కార్మికుల తొలగింపులు ఆపకపోతే నిరవధిక సమ్మె తప్పదని హెచ్చరించారు. కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన కార్మిక వ్యతిరేక నాలుగు లేబర్‌ కోడ్‌లను వెంటనే రద్దు చేయాలని, ప్రభుత్వ రంగ సంస్థల ప్రైవేటీకరణ విధానాలను వెనక్కి తీసుకోవాలని డిమాండ్‌ చేశారు. సమ్మె నోటీసు ఇచ్చినవారిలో నాయకులు నమ్మి రమణ, కె.వంశీ, ఆనంద్‌, నాగరాజు, పి.గురునాథ్‌, నమ్మి చంద్రరావు తదితరులు పాల్గొన్నారు.

పోర్టు హాస్పిటల్‌ ప్రయివేటీకరణ ఆపాలి

ప్రజాశక్తి-సీతమ్మధార : పోర్టు హాస్పిటల్‌ ప్రైవేటీకరణ అపాలని ఆల్‌ ఇండియా లాయర్స్‌ యూనియన్‌ (ఐలు) జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు డిమాండ్‌చేశారు. పోర్టు హాస్పిటల్‌ ప్రయివేటీకరణను వ్యతిరేకిస్తూ ఆసుపత్రి వద్ద చేపట్టిన రిలే నిరాహారదీక్షలు శనివారం నాటికి 215వ రోజుకు చేరుకున్నాయి. ఈ దీక్షలకు ఐలు మద్దతు తెలిపింది. ఈ సందర్భంగా వెంకటేశ్వర్లు మాట్లాడుతూ, హాస్పిటల్‌ ప్రైవేటీకరణపై రాష్ట్రంలో ఉన్న కూటమి ప్రభుత్వం స్పందించాలన్నారు. హాస్పిటల్‌ టెండర్‌కు వచ్చిన వారిని అడ్డుకోవాలని పిలుపునిచ్చారు. ప్రైవేటీకరణ నిర్ణయం అనైతికమని, హాస్పిటల్‌ అభివృద్ధి కార్మికుల కషితోనే సాధ్యమైందని తెలిపారు. సుమారు 40 వేల మంది కార్మికుల ఆరోగ్యానికి సంబంధించిన సేవలను ప్రైవేటుకు అప్పగించడం తగదన్నారు. విశాఖ అభివృద్ధిలో విశాఖపట్నం పోర్టు కీలకమన్నారు. ఏటా మున్సిపాలిటీకి సగటున రూ.65 కోట్లు పన్నుల రూపంలో కడుతోందని తెలిపారు. టెండర్‌ను మే12వ తేదీకి వాయిదా వేయడం కాదని, పూర్తిగా రద్దు చేయాలని కోరారు. పోర్టు యాజమాన్యం వద్ద రిజర్వ్‌ ఫండ్‌, వేల ఎకరాల భూమి ఉన్నప్పటికీ, ప్రైవేటీకరణపై తీసుకున్న నిర్ణయం అన్యాయమని పేర్కొన్నారు. ఈ విధానాన్ని వెంటనే విరమించుకోవాలని డిమాండ్‌ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు కె.సత్యనారాయణ, జక్కాన సత్యనారాయణ, సిహెచ్‌.త్రినాధరావు, బి.జగన్‌, నాయుడు తదితరులు పాల్గొన్నారు.



దీక్షలో నినదిస్తున్న కార్మికులు

శ్రీరెడ్డి కేసులో బెయిల్‌ బాండ్లు అందజేత

ప్రజాశక్తి-లీగల్‌ : కంచరపాలెం పోలీస్‌ స్టేషన్లో శ్రీరెడ్డిపై ఉన్న కేసులో హైకోర్టు ఇచ్చిన బెయిల్‌ ఆర్డర్‌ అమలుపరుస్తూ బెయిల్‌ బాండ్లు ఆమె తరుపున వైసిపి లీగల్‌ సెల్‌ విశాఖ అధ్యక్షులు ఎం.ఎ.ప్రసాద్‌ ఆధ్వర్యాన అందించారు. ఈ కార్యక్రమంలో వైసిపి లీగల్‌ సెల్‌ న్యాయవాదులు సూరిశెట్టి అనిల్‌కుమార్‌, గిల్లబర్ట్‌ భాయ్‌, సింహాద్రి రవికుమార్‌ పాల్గొన్నారు.

స్టీల్‌ప్లాంట్‌ ఒబిసి ఉద్యోగుల వెబ్‌సైట్‌ ఆవిష్కరణ

ప్రజాశక్తి-ఉక్కునగరం : విశాఖ స్టీల్‌ప్లాంట్‌ ఒబిసి ఎంప్లాయీస్‌ వెల్ఫేర్‌ అసోసియేషన్‌ వెబ్‌సైట్‌, మొబైల్‌ యాప్‌ను స్టీల్‌ప్లాంట్‌ ఇన్‌ఛార్జి డైరెక్టర్‌ జివిఎం.ప్రసాద్‌, డైరెక్టర్‌ కమర్షియల్‌ కం అడిషనల్‌ ఛార్జ్‌ ఫైనాన్స్‌ ఎం మధుసూదనరావు, జనరల్‌ మేనేజర్లు ఎన్‌.భాను, ఎస్‌.ఉమామహేశ్వర రావు ఉక్కునగరంలోని హెచ్‌ఆర్‌డి హాల్లో శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జివిఎం.ప్రసాద్‌ మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ పరిశ్రమలో ఒబిసి వెల్ఫేర్‌ అసోసియేషన్‌ పెద్ద సంఘం అని, కార్మికులు, అధికారుల సంక్షేమం కోసం పాటుపడడం ఎంతో అభినందనీయమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం అధ్యక్షులు బి.అప్పారావు, ప్రధాన కార్యదర్శి శ్రీనివాసరావు, ఉప ప్రధాన కార్యదర్శి కోయిలాడు శ్రీనివాస్‌, వర్కింగ్‌ ప్రెసిడెంట్‌ వైఎల్‌.నాయుడు, ఉపాధ్యక్షుడు వంగపండు సింహాచలం, శశిభూషణరావు, బి.కామేశ్వరరావు, నర్సింగరావు, శేషగిరి, సన్నిబాబు, రామకృష్ణ, శ్రీనివాసులునాయుడు, మొహిద్దీన్‌, జిబి.సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

అపారిశుధ్యంపై ఆగ్రహం

- జిల్లా కలెక్టర్ సుడిగాలి పర్యటన
- ఉపాధి పనులు, నీటిగుంటల పరిశీలన
- జల్‌జీవన్ మిషన్ పనుల వేగవంతానికి ఆదేశం

ప్రజాశక్తి -వడ్డాది/ బుచ్చయ్యపేట

మండలంలోని ఎల్‌బిపి అగ్రహారం, బంగారుమెట్ట గ్రామాల్లో శనివారం జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ సుడిగాలి పర్యటన చేశారు. ఎల్‌బిపి.పురంలో అపారిశుధ్యంపై కలెక్టర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామంలో ప్రతిరోజూ క్లోరినేషన్ చేయించాలని కార్యదర్శిని ఆదేశించారు. పంచాయతీ నుంచి స్థలం సేకరించి చెత్త నుండి సంపద తయారీ కేంద్రం నిర్మించాలని, చెత్త సేకరణకు వాహనాన్ని కొనుగోలు చేయాలని జెడ్‌పి సిఇఒ రాజ్ కుమార్‌కు సూచించారు. చెరువులో ఉపాధి పనులను పరిశీలించి, కూలీలతో మాట్లాడారు. రోజువారి వేతనం రూ.300 కంటే తక్కువ రావడం, లోతు తక్కువ తవ్వకంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. శ్రీను అనే రైతు పొలంలో నీటి గుంతను పరిశీలించి, అక్కడ మొక్కలు నాటారు. నీటి నిల్వకు అవసరమైన పనులు చేపట్టాలని ఎపిఒను ఆదేశించారు.

బంగారుమెట్టలో నీటి తొట్టెను ప్రారంభించారు. అక్కడ చెత్త ఉండడంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ.68 లక్షలతో నిర్మిస్తున్న జల్‌జీవన్ మిషన్ ట్యాంకు పరిశీలించి, ఇంటింటికీ కుళాయి ఏర్పాటుకు వెంటనే పైపులైన్ ఏర్పాటు చేయాలని ఆదేశించారు.


స్థానికులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయ కృష్ణన్

పలువురు సమస్యలపై ప్రజల నుంచి వినతి పత్రాలు స్వీకరించారు. డ్వామా పీడీ పూర్ణిమా దేవి, ఎపిడి శ్రీనివాస్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇఇ రామస్వామి, మండల ప్రత్యేక అధికారి గోపాలకృష్ణ, ఎంపిడిఒ విజయలక్ష్మి, తహసిల్దార్ లక్ష్మి, ఎపిఒ వరహాలబాబు, మాజీ సర్పంచ్ తమరాన దాసు, సర్పంచులు మొల్లి శ్రీను, మేరుగు కుమారి, ఎంపిటిసి యల్లపు జగ్గయ్యమ్మ, మాజీ ఎంపిటిసి దొండా శ్రీను, టిడిపి నేత సాయం శేషు పాల్గొన్నారు.


డిఆర్‌ఒకు వినతిపత్రం ఇస్తున్న సిపిఎం నేతలు కోటి, శంకర్, శ్రీరామ్

సమస్యలు పరిష్కరించాలని సిపిఎం వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి

అనకాపల్లి జిల్లాలో 24 మండలాల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరుతూ సిపిఎం జిల్లా కార్యదర్శి జి.కోటేశ్వరరావు, కార్యదర్శివర్గ సభ్యులు ఆర్.శంకరరావు, గంటా శ్రీరామ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సిపిఎం ఆధ్వర్యంలో ప్రజా చైతన్య యాత్ర పేరుతో చేసిన పాదయాత్రలో గుర్తించిన సమస్యలపై శనివారం జిల్లా కలెక్టరేట్‌లో జిల్లా రెవెన్యూ అధికారి సత్యనారాయణ రావుకు వినతిపత్రాన్ని అందించారు. పలు మండలాల్లో ప్రజలు భూసమస్యలు, తాగునీరు, రోడ్లు, రేషన్‌కార్డులు, పింఛన్లు, డ్రైనేజీ సమస్యలు ఎదుర్కొంటున్నారని తెలిపారు. జిల్లాలో ఉపాధి పనులకు సంబంధించి ఎన్నడూ లేని విధంగా బకాయిలు పున్నాయని తెలిపారు. గోవాడ సుగర్ ఫ్యాక్టరీ పరిధిలోని రైతులకు సుమారు 30కోట్ల రూపాయలు బకాయిలు వున్నాయని చెప్పారు. నక్కపల్లి మండలంలో బల్క్‌డ్రగ్ పరిశ్రమ నిర్మాణంలో డి ఫారం భూములు కోల్పోయిన వారికి జిరాయితీ భూములతో సమానంగా నష్టపరిహారం అందలేదన్నారు. నాన్‌షెడ్యూల్ ప్రాంతంలోని గ్రామాల్లో జీడిరైతులు తీవ్రంగా నష్టపోయారని, గిట్టుబాటు ధరలేదని, వారిని ఆదుకోవాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. పరవాడ మండలంలో ఫార్మా కాలుష్యంతో బాధపడుతున్న తాడి గ్రామాన్ని తరలిస్తామని గతంలో పలుమార్లు హామీ ఇచ్చారని, నేటికీ గ్రామాన్ని తరలించలేదన్నారు. ఎన్టీపిసి కాలుష్యం వల్ల మూలస్వయంభూమవరం గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, ఈ గ్రామాన్ని కూడా తరలించాలని కోరారు. నాన్‌షెడ్యూల్ ప్రాంతంలో గిరిజనులు సాగు చేసుకుంటున్న భూములకు పట్టాలులేవన్నారు. నర్సీపట్నంలో టిడ్కో ఇళ్ల నిర్మాణం పూర్తయినా లబ్ధిదారులకు ఇవ్వలేదని తెలిపారు. ఈ సమస్యలు పరిష్కరించాలని కోరారు.


ఆందోళన చేస్తున్న కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్లు

5వ రోజుకు సిహెచ్‌ఒల సమ్మె

ప్రజాశక్తి-అనకాపల్లి : వైద్యఆరోగ్యశాఖలో నేషనల్ హెల్త్‌మిషన్ ఆయుష్మాన్ ఆరోగ్య మిషన్‌లో పనిచేస్తున్న కమ్యూనిటీ హెల్త్ అధికారులు సమస్యలు పరిష్కరించాలని కోరుతూ చేస్తున్న సమ్మె శనివారం నాటికి ఐదు రోజులుగా చేరింది. ఈ సందర్భంగా యూనియన్ నాయకులు మాట్లాడుతూ సమస్యలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఆయుష్మాన్ భారత్ నిబంధన ప్రకారం ఆరు సంవత్సరాలు దాటిన ప్రతి సిహెచ్‌ఒను క్రమబద్ధీకరించాలని, ఉద్యోగభద్రత కల్పించాలని, ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులతో సమానంగా 23 శాతం వేతన సవరణ చేయాలని, ప్రతి సంవత్సరం 5 శాతం ఇంక్రిమెంట్, పనిఆధారిత ప్రోత్సాహకాలు, ఈపిఎఫ్‌ఒ పునరు ద్ధరించాలని డిమాండ్లపై ఆందోళన చేపట్టారు. జిల్లాలోని 45 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో పనిచేస్తున్న సిహెచ్‌ఒలు సమ్మెలో పాల్గొన్నారు. కార్యక్రమానికి సిఐటియు జిల్లా కోశాధికారి, ఎపి కాంట్రాక్ట్ అవుట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ ఫెడరేషన్ జిల్లా కన్వీనర్ వి.వి. శ్రీనివాసరావు సంపూర్ణ మద్దతు తెలిపారు. తక్షణమే వారి న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేశారు.

క్రీడల కోటా 3 శాతం పెంపుపై హర్షం

ప్రజాశక్తి-అనకాపల్లి : రాష్ట్రంలో డిఎస్సి ఉపాధ్యాయ పోస్టుల భర్తీలో క్రీడల కోటాను మూడు శాతానికి పెంచడంపై అనకాపల్లి జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘం జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు చిరికి వెంకటరావు, కెఎం. నాయుడు హర్షం వ్యక్తం చేశారు. అనకాపల్లిలో శనివారం జరిగిన జిల్లా వ్యాయామ ఉపాధ్యాయుల సంఘ సమావేశంలో వారు మాట్లాడారు. క్రీడాకారులు, క్రీడాభిమానుల 30ఏళ్ల కోరిక ఎట్టకేలకు నెరవేరిందన్నారు. నిర్ణయం తీసుకున్న కూటమి రాష్ట్ర ప్రభుత్వంతో పాటు కృషి చేసిన సహకరించిన వారందరికీ కృతజ్ఞతలు తెలియజేస్తున్నా మన్నారు. భవిష్యత్తులో అన్ని నియామకాల్లోనూ, పదోన్నతుల్లో కూడా మూడుశాతం కోటాను అమలు చేస్తూ ఉత్తర్వులు విడుదల చేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రవేశ పరీక్షల ఫలితాలతో నిమిత్తం లేకుండా క్రీడల్లో ఉన్న ప్రతిభఆధారంగా నేరుగా ఉద్యోగ నియామకాలు చేపట్టాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం క్రీడాభివృద్ధికి చేపడుతున్న అన్ని కార్యక్రమాలకు తాము సహకరిస్తామన్నారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ జిల్లా కార్యదర్శి మోటూరు నాగేశ్వరరావు, సంఘ ప్రతినిధులు ఎస్.శ్రీనివాసరావు, పివి.నాయుడు, శ్యాం ప్రసాద్, గాలిరాజు, బొబ్బిలి అప్పలరాజు, ఎన్.ఎస్.రాజా, ఎస్వీ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

9న పెందుర్తిలో మెగా జాబ్‌మేళా

ప్రజాశక్తి -సబ్బవరం : పెందుర్తిలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 9న నియోజకవర్గస్థాయిలో మెగా జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్‌బాబు ఒక ప్రకటనలో తెలిపారు.ఏపి స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించే జాబ్ మేళాలో 40 ప్రముఖ కంపెనీలో ప్రతినిధులు పాల్గొని, 2500 ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహిస్తారన్నారు. నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పూర్తి వివరాలకు 8712655686, 8790118349, 8790117279, 8555868681, 9966965502. ఫోన్ నెంబర్లకు సంప్రదించాలని కోరారు.

అధ్వానంగా వెంకన్నపాలెం-వడ్డాది రోడ్డు

నీటి కుంటలను తలపిస్తున్న రహదారి


నీటి కుంటలను తలపించేలా ఉన్న పెద్ద పెద్ద గోతులు

ప్రజాశక్తి-చోడవరం రూరల్

మండలంలోని వెంకన్నపాలెం నుండి బుచ్చయ్యపేట మండలం వడ్డాది వరకు ప్రధాన రహదారి అధ్వానంగా ఉంది. ఈ రహదారిలో అడుగడుగునా నీటి కుంటలను తలపించే విధంగా గోతులు ఉన్నాయి. వర్షపు నీరు ఆ గుంతల్లో చేరడంతో వాటి లోతు ఎంత తెలియక వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. గత ప్రభుత్వం హయాంలో ఈ రహదారి అధ్వానంగా ఉండడంతో జనం ఆగ్రహించారు. ఈ రోడ్డు అస్తవ్యస్తతనే గత ఎన్నికల్లో కూటమి అభ్యర్థి కెఎస్‌ఎన్‌ఎస్.రాజు విమర్శలు గుప్పించారు. దీంతో ఎమ్మెల్యేగా రాజును గెలిపించారు. కూటమి ప్రభుత్వం వచ్చి 11నెలలు కావస్తున్నా నేటికీ ఈ రోడ్డు దుస్థితి మాత్రం మారలేదు. ద్విచక్ర వాహనదారులు, ఆటో కార్మికులు, ఇతర వాహనదారులు కూటమి ప్రభుత్వ తీరుపైనా, ఎమ్మెల్యే నిర్లక్ష్యంపైనా విమర్శలు చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం, ఎమ్మెల్యే దీనిపై దృష్టి పెట్టి ఈ రహదారిని పునర్నిర్మించాలని కోరుతున్నారు.

జగనన్న కాలనీలో సౌకర్యాల లేమి

- కనీస వసతులు లేక నివాసానికి ఇక్కట్లు
- మెయిన్‌రోడ్డులో ప్రమాదకర మలుపుతో భయం


సౌకర్యాల్లేని సింగన్నదొరపాలెం జగనన్న కాలనీ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని సింగన్నదొరపాలెం గ్రామస్తులకు ఇచ్చిన జగనన్న కాలనీలో కనీస వసతులు, సౌకర్యాలు లేక కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారు. గ్రామానికి సుదూరంగా సూరెడ్డిపాలెం గ్రామ దగ్గరలో గత ప్రభుత్వం సింగన్నదొరపాలేనికి చెందిన 16 మందికి ఇళ్లపట్టాలు మంజూరుచేసి, ఇళ్ల నిర్మాణాలను చేపట్టింది. అయితే కాలనీలో అంతర్గత రోడ్లు, డ్రైనేజీ సదుపాయం కల్పించలేదు. మంచినీటి సరఫరాకు బోరు పాయింట్ తవ్వినా ట్యాంక్ నిర్మాణం చేపట్టలేదు. కాలనీని ఆనుకుని కె. కోటపాడు నుండి ఆనందపురం వెళ్లే ప్రధాన ఆర్‌అండ్‌బి రోడ్డులో కాలనీ వద్ద పెద్ద మలుపు ఉండడంతో వాహనాలు రాకపోకలు సమయంలో ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని కాలనీవాసులు భయపడుతున్నారు. ఈ నేపథ్యంలో కాలనీలో నివాసయోగ్యంగా ఉండేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాల కల్పనతోపాటు మెయిన్‌రోడ్డు వద్ద వాహనాల వేగనియంత్రణకు రెండు స్పీడు బ్రేకర్లు ఏర్పాటు చేయాలని కాలనీవాసులు కోరుతున్నారు.

అమ్మ హెల్పింగ్ హార్ట్స్‌కు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం

ప్రజాశక్తి- వడ్డాది : వడ్డాది, చోడవరం కేంద్రాలుగా సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్న అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సంస్థకు యంగ్ ఇండియన్ సేవా పురస్కారం-2025 లభించింది. 16ఏళ్లగారక్తదాన శిబిరాలు నిర్వహిస్తూ గ్రామీణప్రజలకు ఉచితంగా రక్తం సమకూరుస్తున్నందుకు తెలంగాణా భద్రాద్రి కొత్తగూడెం యంగ్ ఇండియన్ బ్లడ్ డోనర్స్ క్లబ్ ఈ అవార్డు అందజేసింది. . హైదరాబాదులో జిహెచ్‌ఎంసి డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, హెచ్‌ఎండబ్ల్యుఎస్ ఎస్‌పి అశోక్ రెడ్డి, సంస్థ నిర్వాహకులు నుంచి అమ్మ హెల్పింగ్ హార్ట్స్ సభ్యులు అవార్డు స్వీకరించారు.

5న వైసిపి జిల్లా సమావేశం

ప్రజాశక్తి -మునగపాక : ఈనెల 5న నిర్వహించే వైసిపి జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశాన్ని జయప్రదం చేయాలని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి బొడ్డేటి ప్రసాద్ పిలుపునిచ్చారు. శనివారం స్థానిక బొడ్డేడ క్యాంపు కార్యాలయంలోకార్యకర్తల సమావేశంలో మాట్లాడుతూ అనకాపల్లి రింగ్ రోడ్డు జంక్షన్ పెంటకోట కన్వెన్షన్ హాల్‌లో నిర్వహించే. ఈ సమావేశానికి మండలంలోని ప్రజాప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు ,అభిమానులు తరలివచ్చి విజయవంతం చేయాలని కోరారు. సమావేశంలో మాజీ జెడ్‌పిటిసి మల్ల సంజీవరావు, మాజీ ఎంపిపి దాసరి అప్పారావు, మద్దాల వీరి నాయుడు, బి శెట్టి గంగ అప్పల నాయుడు, కాండ్రేగుల నూకరాజు, ఆడారి కాశి బాబు పాల్గొన్నారు.

డిసిఎంఎస్ చైర్మన్‌కు సత్కారం

ప్రజాశక్తి -బుచ్చయ్యపేట : విశాఖ జిల్లా సహకార మార్కెటింగ్ సొసైటి (డిసిఎంఎస్) చైర్మన్‌గా నియమితులైన తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కోట్ని బాలాజీని తెలుగు యువత అనకాపల్లి జిల్లా ఉపాధ్యక్షులు సిరిగిరిశెట్టి శ్రీరామమూర్తి, వృద్ధి, ప్రదీప్, బుచ్చయ్యపేట మండలం యాదవ సంఘం అధ్యక్షుడు సింగంపల్లి రమేష్ మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు దుశ్శాలువాతో సత్కరించి చిత్రపటాన్ని బహుకరించారు.


డిసిఎంఎస్ చైర్మన్ బాలాజీని సత్కరిస్తున్న తెలుగు యువత నాయకులు



లావణ్యను అభినందిస్తున్న కలెక్టర్ విజయకృష్ణన్

టెన్త్ టాపర్‌కు అభినందన

ప్రజాశక్తి-కశింకోట : టెన్త్ ఫలితాల్లో కస్తూర్బా పాఠశాలల్లోనే రాష్ట్రస్థాయి టాపర్‌గా నిలిచిన మండలంలోని తేగాడ కస్తూర్బా పాఠశాల విద్యార్థిని జి. లావణ్యను జిల్లా కలెక్టర్ విజయకృష్ణన్ అభినందించారు. ఇటీవల విడుదలైన టెన్త్ ఫలితాల్లో 566 మార్కులు సాధించి, లావణ్య కస్తూర్బాల్లో రాష్ట్రస్థాయిలోనే టాపర్‌గా నిలిచిందని పాఠశాల ప్రిన్సిపాల్ దొండ చంద్రకళ తెలిపారు లావణ్యకు స్థానిక ఉపాధ్యాయులు, సహచర విద్యార్థులు అభినందనలు తెలిపారు

పలుచోట్ల ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం

ప్రజాశక్తి - విశాఖ కలెక్టరేట్: ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను అల్లిపురంలోని సంఘం కార్యాలయం వద్ద నిర్వహించారు. సంఘం జిల్లా అధ్యక్షులు వై.రాంబాబు, నాయకులు నాగరాజ్, అభిషేక్, సింహాద్రి తదితరులు పాల్గొన్నారు.

ఆరిలోవ : ఎఐవైఎఫ్ 66వ వ్యవస్థాపక దినోత్సవాన్ని ఆరిలోవ కాలనీ భగత్‌సింగ్‌నగర్‌లో శనివారం నిర్వహించారు. సంఘం జెండాను జిల్లా కార్యదర్శి కె.సందీప్ ఆవిష్కరించారు. అనంతరం ఈ నెల 15 నుంచి 18వ తేదీ వరకు తిరుపతిలో జరిగే యువజన సమాఖ్య జాతీయ మహాసభలకు సంబంధించి పోస్టర్‌ను విడుదలచేశారు. ఈ కార్యక్రమంలో టి.దినేష్, ఎ.రాజు, ఎస్‌కె.సుభాని, నవ్య, పర్లిత, సురేష్, అరవింద్, వెంకటేష్ పాల్గొన్నారు.

అనకాపల్లి రూరల్ : ఎఐవైఎఫ్ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా యూనియన్ జెండాను సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి వియ్యపు రాజు ఆవిష్కరించారు. కార్యక్రమంలో శ్రావణి, దివ్య, లావణ్య, కీర్తన, అపర్ణ, నాయుడు, శ్రీనివాస్, సురేష్, మనోజ్, తరుణ్, జగదీష్, భానుప్రసాద్, నరేష్ పాల్గొన్నారు.

నేడు ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి-సబ్బవరం : మండలంలోని బంగారంమ్మపాలెం గ్రామ సచివాలయ ఆవరణలో ఈనెల 4న ఆదివారం అమృత హాస్పిటల్ ఆధ్వర్యంలో వాసన్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గ్రామ సర్పంచ్ దాడి లావణ్య కన్నంనాయుడు తెలిపారు. ఈ శిబిరంలో ఉచిత కంటిపరీక్షలతోపాటు ఆపరేషన్లు ఉచితంగా చేస్తారన్నారు. కంటిబిద్దాలు తక్కువ ధరకు అందజేస్తారని, ప్రజలు దీన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఎంపిటిసి రాపేటి అరుణ రాము, మాజీ ఎంపిటిసి దొడ్డి సూర్యప్రకాష్ రావు, సిహెచ్.దేవి, గ్రామ పెద్దలు, యూత్ సహకారంతో నిర్వహించే కంటి వైద్యశిబిరాన్ని వినియోగించుకోవాలని సర్పంచ్ కోరారు. వివరాలకు 9951116166, 7989394181 ఫోనునెంబర్లకు సంప్రదించాలన్నారు.

మహిళలకు కూటమి ప్రభుత్వం పెద్దపీట

ప్రజాశక్తి- మునగపాక: కూటమి ప్రభుత్వం మహిళలకు పెద్దపీట వేస్తోందని ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ అన్నారు. శనివారం మునగపాకలో ఉచిత కుట్టు మిషన్ శిక్షణ కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ బిసి కార్పొరేషన్ సహకారంతో మహిళలకు స్వయం ఉపాధి కల్పన లక్ష్యంగా పలు ప్రాంతాల్లో టైలరింగ్ శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు. మహిళలందరికీ వృత్తి నైపుణ్య శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పనకు 90 రోజులు శిక్షణ ఉంటుందన్నారు. శిక్షణ అనంతరం కుట్టుమిషన్ ఉచితంగా అందిస్తారన్నారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, కూటమి నాయకులు, పాల్గొన్నారు.



ఉచిత కుట్టు శిక్షణా కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే విజయ్‌కుమార్

అధికార దర్పం

- సర్పంచ్ చెప్పిన సమయానికే కిశోర వికాసం కార్యక్రమం ఏర్పాటు
- హాజరు కాని సదరు ప్రజాప్రతినిధి
- ప్రొటోకాల్ పాటించలేదని అంగన్వాడీ కార్యకర్తకు మెమో జారీ చేసిన ఐసిడిఎస్ అధికారి
- తప్పులేదని తేలడంతో నోటీసు వెనక్కి

ప్రజాశక్తి-పరవాడ : గ్రామాల్లో పని చేసే స్కీమ్ వర్కర్లపై అధికారులు, అధికార పార్టీ నాయకులు అధికార దర్పాన్ని ప్రదర్శిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. మండలంలోని రావాడ పంచాయతీ పరిధి ధర్మరాయుడుపేట అంగన్వాడీ కార్యకర్త కొప్పాక ఉమాదేవి తప్పు ఏమీ లేకపోయినా ఆమెకు శుక్రవారం సబ్బవరం ఐసిడిఎస్ అధికారి మెమో జారీ చేయడం ఇందుకు నిదర్శనంగా చెప్పవచ్చు. అయితే సదరు అంగన్వాడీ కార్యకర్త తప్పేమీ లేదని తేలడంతో ఆ నోటీసును శనివారం వెనక్కి తీసుకున్నారు. దీనికి సంబంధించి వివరాలు ఇలా ఉన్నాయి....

రావాడ పంచాయతీ పరిధి ధర్మరాయుడుపేట అంగన్వాడీ కేంద్రంలో ఈ నెల 2వ తేదీన 'కిశోర వికాసం' ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ఆ గ్రామ అంగన్వాడీ కార్యకర్త కొప్పాక ఉమాదేవి ఈ కార్యక్రమానికి స్థానిక పంచాయతీ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడును ఆహ్వానించడంతో పాటు ఏ సమయానికి కార్యక్రమం ఏర్పాటు చేయాలో అడిగారు. 2వ తేదీన ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేయాలని సర్పంచ్ సూచించగా, అందుకు అనుగుణంగా అంగన్వాడీ కార్యకర్త ఏర్పాట్లు చేశారు. కార్యక్రమానికి కూటమి భాగస్వామ్య పార్టీ టిడిపి మండల అధ్యక్షుడు వియ్యపు చిన్నను కూడా ఆహ్వానించగా ఆయన సమయానికి హాజరయ్యారు. అయితే సమయం చెప్పిన సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడు ఆ సమయానికి హాజరు కాకుండా కార్యక్రమాన్ని మధ్యాహ్నానికి వాయిదా వేయాలని ఆదేశించారు. అయితే అప్పటికే కార్యక్రమానికి అందరూ హాజరు కావడంతో యథావిధిగా అనుకున్న సమయానికి కిశోర వికాసం కార్యక్రమం నిర్వహించారు. మరి తెరవెనుక ఏమి జరిగిందో తెలియదు గాని సబ్బవరం ఐసిడిఎస్ అధికారి వి.లలితకుమారి ధర్మరాయుడుపేట అంగన్వాడీ కొప్పాక ఉమాదేవికి మెమో జారీ చేశారు. కిశోర వికాసం ప్రారంభోత్సవం కార్యక్రమాన్ని సర్పంచ్ లేకుండా నిర్వహించడంపై వివరణ ఇవ్వాలని ఆ మెమోలో కోరారు. దీనిపై ఐసిడిఎస్ అధికారులు విచారణ చేయగా... రావాడ సర్పంచ్‌ను అంగన్వాడీ కార్యకర్త ఆహ్వానించడం, ఆయన సూచించిన సమయం ఉదయం 9 గంటలకు కార్యక్రమం ఏర్పాటు చేయడం, జిఎంఎస్‌కె వారికి సమాచారం ఇవ్వడం, అనివార్యకారణాల వల్ల సర్పంచ్ రాకపోవడం, కూటమి నాయకులు, కిశోర బాలికలు అప్పటికే వచ్చి ఉన్నందున కార్యక్రమం నిర్వహించడం చేసినట్లు తేలింది. ఈ వ్యవహారంలో అంగన్వాడీ కార్యకర్త కొప్పాక ఉమాదేవి తప్పు ఏమి లేదని నిర్ధారణ కావడంతో ఆమెకు ఇచ్చిన మెమోను వెనక్కి తీసుకుంటూ సబ్బవరం ఐసిడిఎస్ అధికారులు శనివారం ఓ ప్రకటన జారీ విడుదల చేశారు. 'కిశోర వికాసం' కార్యక్రమం గురించి సమాచారం ఇచ్చారా? లేదా? అని తెలుసుకొనేందుకు రావాడ సర్పంచ్ మోటూరు సన్యాసినాయుడుకు ప్రజాశక్తి ప్రతినిధి ఫోన్ చేయగా, ఆయన ఫోన్ లిఫ్ట్ చేయలేదు.

స్కీమ్ వర్కర్లుగా వారి విధులతో పాటు ప్రభుత్వం అప్పగించే అన్ని పనులు చేస్తూ చాలీచాలని జీతాలతో సక్రమంగా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న అంగన్వాడీలకు కొంత మంది నాయకుల ఆధిపత్యపోరు కారణంగా ఇలా మెమోలు జారీ చేసి వారిని భయాందోళనకు గురిచేయడం సమంజసం కాదని పలువురు అభిప్రాయపడుతున్నారు.

కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతాం

వైసిపి జిల్లా అధ్యక్షుడు గుడివాడ అమర్‌నాథ్



మాట్లాడుతున్న వైసిపి జిల్లా అధ్యక్షులు అమర్‌నాథ్

ప్రజాశక్తి -చోడవరం : కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడతామని వైసిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు గుడివాడ అమర్నాథ్ అన్నారు. శనివారం చోడవరంలో విలేకరులతో మాట్లాడుతూ, లేనిపోని హామీలిచ్చి ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కూటమి నేతలు, 11నెలలు గడుస్తున్నా వాటిని అమలు చేయడం లేదన్నారు. నర్సీపట్నం, చోడవరం రోడ్డు అధ్వాన్నస్థితిపై ప్రచారం చేసి ఓట్లు దండుకుని తర్వాత ముఖం చాటేశారన్నారు. గోవాడ సుగర్స్‌ను తీవ్రసంక్షోభంలోకి నెట్టారని, రైతులు, కార్మికులకు రూ.40కోట్ల బకాయి చెల్లించాల్సి ఉందన్నారు. రోలుగుంట మండలంలోని క్వారీల్లో ఐటిడిపి కార్యకర్తలు దందాలకు పాల్పడుతూ వసూళ్ళ చేస్తున్నారని ఆరోపించారు. కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ఆయాపార్టీల శ్రేణులు అక్రమాలపై ఈనెల 5న అనకాపల్లిలో జరిగే పార్టీ జిల్లాస్థాయి విస్తృతస్థాయి సమావేశంలో చర్చించి తగు కార్యాచరణ జరుగుతుందన్నారు. కార్యక్రమంలో వైసిపి మండల అధ్యక్షుడు వెంకటరావు, యువజన విభాగం జిల్లా అధ్యక్షుడు పుల్లేటి వెంకటేష్, ఎంపిపి గాడి కాసులమ్మ, బొడ్డేటి సూర్యనారాయణ, బొడ్డు శ్రీరామమూర్తి, కోవెల జనార్ధనరావు, దొండ నారాయణమూర్తి పాల్గొన్నారు.



క్రాఫ్ట్ శిక్షణలో పాల్గొన్న చిన్నారులు

క్రాఫ్ట్ వర్క్‌పై పిల్లలకుశిక్షణ

ప్రజాశక్తి - రాంబిల్లి : అనకాపల్లి చిల్డ్రన్స్ క్లబ్ ఆధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా 10 కేంద్రాల్లో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంప్‌లో భాగంగా రాంబిల్లి మండలం అప్పారాయుడుపాలెంలో ఐద్వా మండల అధ్యక్షురాలు చందక మంగతాయారు ఆధ్వర్యంలో వేసవి శిబిరంలో పిల్లలకు కలర్స్ పేపర్స్ ఖాళీ డ్రింక్ బాటిల్స్‌తో క్రాఫ్ట్, ఆర్ట్ తయారీపై క్రాఫ్ట్ టీచర్ కమండూరి జ్యోతిర్మయి నేర్పించారు. జన విజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి మారిశెట్టి వెంకట అప్పారావు మాట్లాడుతూ, పిల్లల్లో మానసికోల్లాసానికి సృజనాత్మకతకు క్రాఫ్ట్, డ్రాయింగ్ దోహదపడతాయన్నారు.

కార్మిక సమ్మెను జయప్రదం చేయండి



బుక్‌లెట్‌ను విడుదల చేస్తున్న సిఐటియు నేత గనిశెట్టి, కార్మికులు

ప్రజాశక్తి - పరవాడ : లేబర్ కోడ్‌ల రద్దు, ఇతర సమస్యల పరిష్కారానికి ఈ నెల 20న దేశవ్యాప్త కార్మిక సమ్మెను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు గని శెట్టి సత్యనారాయణ పిలుపునిచ్చారు. శనివారం పరవాడలో సమ్మె బుక్‌లెట్ సిఐటియు నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గనిశెట్టి మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న 44 కార్మికచట్టాలను కుదించి, యాజమాన్యాలకు అనుకూలంగా నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకొచ్చి కార్మికులకు కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం తీరని అన్యాయం చేస్తోందన్నారు. దీనికి నిరసనగా దేశంలోని అన్ని కార్మిక , రైతు సంఘాలు చేపట్టే 20న సమ్మె విజయవంతం చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు కే రమణ, రాజు, అప్పలరాజు, జి చిట్టిబాబు, జె.పెంటారావు, ఎస్ అప్పలనాయుడు, ఎం కొండబాబు, వి అప్పలనాయుడు, పి అప్పలరాజు పాల్గొన్నారు.

ఉత్సాహంగా వేసవి విజ్ఞాన శిబిరాలు

ప్రజాశక్తి -ఆనందపురం : ఆనందపురం శాఖా గ్రంథాలయంలో శనివారం వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా పిల్లలకు గ్రంథాలయాధికారి అప్పారావు, సీనియర్ పాఠకులు ఎ.అప్పలరాజు కథలు చెప్పారు. అనంతరం రిసోర్స్ పర్సన్స్ శంకర్, కె.రాజు ఇంగ్లీష్ గ్రామర్, పదాలు ఎలా పలకాలో నేర్పించారు.

నక్కపల్లి : మండలంలోని చినదొడ్డిగల్లు గ్రంథాలయంలో శనివారం గ్రంథాలయ అధికారి జనార్ధన్ ఆధ్వర్యంలో వేసవి విజ్ఞాన శిబిరం కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు దేశభక్తి గేయాల పోటీలు నిర్వహించారు. పలువురు విద్యార్థులు పోటీపడి దేశభక్తి గేయాలను ఆలపించారు. విద్యార్థులు ఆలపించిన భక్తి గీతాలు ఎంతగానో అలరించాయి.

సబ్బవరం : మండల కేంద్రం సబ్బవరం శాఖ గ్రంథాలయంలో వేసవి శిక్షణ కార్యక్రమంలో భాగంగా శనివారం గ్రంథాలయం అధికారి వి. శిరీష ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు చెప్పారు. చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. చిత్రలేఖనం పోటీల వల్ల పిల్లలలో ఉన్న సృజనాత్మక శక్తి తెలుస్తుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్ పిడివి రత్నకుమార్, సుమారు 20 మంది విద్యార్థులు, గ్రంథాలయం పాఠకులు పాల్గొన్నారు.



సబ్బవరంలో చిత్ర లేఖనం పోటీల్లో పాల్గొన్న విద్యార్థులు

మామిడిపల్లిలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర

ప్రజాశక్తి- దేవరాపల్లి : మండలంలోని మామిడిపల్లిలో శనివారం మండల ప్రత్యేకాధికారి మంజులవాణి ఆధ్వర్యంలో స్వచ్ఛాంధ్ర, స్వర్ణాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ పెద్దలతో సమావేశమై పి4 సర్వేపై వివరించారు. ఎంపిడిఒ సువర్ణ రాజు సిబ్బందితో కలిసి పశువుల ఆసుపత్రి వద్ద పిచ్చిమొక్కలు, చెత్తాచెదారాన్ని తొలగించారు. డ్రైనేజీలను పరిశీలించారు. రేషన్‌కార్డుదారుల ఇకెవైసిపై డీలర్‌ను అడిగితెలుసుకున్నారు. పెండింగ్‌లో ఉన్నవి పూర్తి చేయాలని ఆదేశించారు. జెడ్‌పిటిసి కర్రి సత్యం, సర్పంచ్ కర్రిసూరి నాయుడు, ఎంపిటిసి పంచాద సింహాచలం నాయుడు, ఆర్‌డబ్ల్యుఎస్ ఎఇఇ చంద్రశేఖర్, హౌసింగ్ ఎఇఇ తేజ, ఇఒపిఆర్‌డి అప్పారావు, పశువైద్యాధికారి డాక్టర్ భాగ్య, స్వచ్ఛభారత్ మండల కోఆర్డినేటర్ వివివి త్రినాథ్, ఎంఆర్ఓ పైడిరాజు, పంచాయతీ కార్యదర్శి శివ, సచివాలయం సిబ్బంది పాల్గొన్నారు .

కార్పొరేటర్ చొరవతో ఫ్లైఓవర్‌పై వెలుగులు

ప్రజాశక్తి - పరవాడ : జివిఎంసి 79వ వార్డు లంకల పాలెం జంక్షన్ నుంచి ఫార్మాసిటీ వెళ్లే ఫ్లైఓవర్ బ్రిడ్జిపై లైట్లను కార్పొరేటర్ రౌతు శ్రీనివాస్ చొరవ తీసుకుని శనివారం మరమ్మతు చేయించారు. ఈనెల 6 నుంచి మరిడిమాంబ పండగ నేపథ్యంలో గ్రామంలో అన్ని ప్రాంతాల్లో వెలగని వీధిలైట్లకు మరమ్మతులు చేయించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మద్యం ఏరులై పారుతున్నా పట్టదా ?

- మండల సమావేశంలో అధికారులను ప్రశ్నించిన సభ్యులు



అధికారులను ప్రశ్నిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని పలు గ్రామాల్లో మద్యం, నాటు సారా ఏరులై పారుతోందని, వీటిపై ఎక్సైజ్ శాఖ అధికారులు పట్టించుకోలేదని, అసలు ఎక్సైజ్ శాఖ ఉందా లేదా? అని న్యాయంపూడి ఎంపిటిసి సభ్యులు ఆకేటి గోవిందరావు ప్రశ్నించారు. మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం ఎంపిడిఓ డి సీతారామరాజు ఆధ్వర్యంలో ఎంపిపి ఏనుగుపల్లి రత్నం అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో ఎంపిటిసి సభ్యులు ఆకేటి గోవిందరావు మాట్లాడుతూ, గ్రామాల్లో మద్యం, నాటుసారా విచ్చలవిడిగా విక్రయాలు చేపడుతున్నారని అధికారులు స్పందించి తక్షణం చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. మద్యం, నాటు సారా నియంత్రణలో ఎక్సైజ్ శాఖ అధికారులు పనితీరు సక్రమంగా లేదని అసహనం వ్యక్తం చేశారు. దోసలపాడు ఎంపిటిసి సభ్యులు పక్కుర్తి రమణ మాట్లాడుతూ, ముకుంద రాజుపేట, దోసలపాడు, దోసలపాడు అగ్రహారం గ్రామాల్లో బెల్ట్ నిర్వహిస్తున్నారని, విచ్చలవిడిగా మద్యం విక్రయాలు చేపడుతున్నారని, దీంతో గ్రామంలో మహిళలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, బెల్ట్ షాపులను అరికట్టాలని కోరారు.

ఎక్సైజ్ ఎస్ఐ ప్రశాంతి మాట్లాడుతూ నాటు సారా, బెల్ట్ షాపులపై దాడులు చేసి కేసులు నమోదు చేస్తున్నట్లు వెల్లడించారు. దీనిపై తహసిల్దార్ నరసింహ మూర్తి మాట్లాడుతూ, నాటు సారా, బెల్ట్ షాపులు నిర్వహణ చేపడితే కఠినంగా శిక్ష పడే విధంగా చర్యలు తీసుకుంటామన్నారు. ఉద్దండపురం ఎంపిటిసి సభ్యులు బచ్చల రాజు మాట్లాడుతూ, నక్కపల్లి 50 పడకల ఆసుపత్రిలో రాత్రిపూట వైద్యం సక్రమంగా అందడం లేదన్నారు. గత నెల 8న, 29 తేదీన రోడ్డు ప్రమాదంలో గాయపడ్డ వారిని నక్కపల్లి ఆసుపత్రికి తీసుకువస్తే సంబంధించిన డ్యూటీ డాక్టర్ సక్రమంగా వైద్యం అందించలేదని ఎంపిడిఓ డి సీతారామరాజుకు ఫిర్యాదు పత్రాన్ని అందజేశారు. గ్రామాల్లో త్రాగునీటి ఎద్దడిని నివారించేందుకు సమ్మర్ యాక్షన్ ప్లాన్ రూపొందించామని ఆర్ డబ్ల్యు ఎస్ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ నాగభూషణం తెలిపారు. ఉపమాక పంచాయతీ సర్పంచ్ ప్రగడ వీరబాబు మాట్లాడుతూ, ఉపమాక పంచాయతీలో జల జీవన్ మిషన్ పనులు అసంపూర్తిగా నిలవడంతో గ్రామంలో తీవ్ర తాగునీటి సమస్య నెలకొందన్నారు. కుళాయిలు సక్రమంగా పనిచేయడం లేదని, అనేక సార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లినప్పటికీ నేటి వరకు సమస్య పరిష్కరించ లేదన్నారు. వెంటనే అధికారులు స్పందించి సమస్యను పరిష్కరించాలన్నారు. డంపింగ్ యార్డ్ కు స్థలం కేటాయించాలని తహసిల్దార్ కు విన్నవించారు. ఎంఈఓ నరేష్ మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలలో పిల్లల చేరికల విషయంలో ప్రజాప్రతినిధులు సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా వేంపాడు ఎంపిటిసి సభ్యులు కుంచె మధు మాట్లాడుతూ, పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మంచి మార్పులు సాధించిన విద్యార్థులను కనీసం పట్టించుకోలేదని, కనీసం అభినందనలు తెలియజేకపోవడం బాధాకరమన్నారు. డిఎల్ పురం ఎంపిటిసి సభ్యులు కొండ్ర కనకారావు మాట్లాడుతూ, ఉపాధ్యాయ వ్యవస్థ గాడి తప్పడంతోనే ప్రభుత్వ పాఠశాలల్లో పిల్లల చేరికలు తగ్గుతున్నాయన్నారు. పాయకరావుపేట నియోజకవర్గం లో పాలిటెక్నిక్ కాలేజ్, బీసీ రెసిడెన్షియల్ స్కూల్ ఏర్పాటుకు సర్వసభ్య సమావేశం తీర్మానం చేయాలని ఎంపిటిసి సభ్యులు మధు, నాగేశ్వరరావు కోరారు. ఎలక్ట్రికల్ డిఈ లక్ష్మీనారాయణ ప్రధానమంత్రి సూర్య ఘర్ యోజన పథకం పై అవగాహన కల్పించారు. వేంపాడు సబ్ స్టేషన్ లో ట్రాన్స్ ఫార్మ్ ప్రారంభోత్సవంలో ఫోటో కాల్ ఎందుకు పాటించలేదని ఎంపిటిసి సభ్యులు కుంచె మధు ప్రశ్నించారు. అధికారికంగా ఇంకా ప్రారంభించలేదని, టెస్టింగ్ మాత్రమే చేసామని ఇన్చార్జ్ ఏ ఈ యుఎమ్ రావు బదులిచ్చారు. గొడిచెర్ల పిహెచ్ సి లో ఆసుపత్రి అభివృద్ధి కమిటీతో సమావేశం ఎందుకు నిర్వహించలేదని ఎంపిటిసి గోవిందరావు ఆసుపత్రి వైద్యురాలు శ్రావణి సంధ్యను ప్రశ్నించారు. వెంటనే మీటింగ్ ఏర్పాటు చేయాలన్నారు.

మండల ప్రత్యేక అధికారి పి ప్రసాద్ పి-4 సర్వే చేపట్టడం జరిగిందని, బంగారు కుటుంబాలకు, మార్గదర్శులు సహాయ,సహకారాలు అందించాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపీలు వీసం నానాజీ, వెలగా ఈశ్వరరావు, జడ్పిటిసి సభ్యురాలు గోసల కాసులమ్మ, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

అనుమతిలేని కట్టడంలో జెసి జాహ్నవి నివాసం

-లే అవుట్ పార్కులో బంగ్లా నిర్మాణం
-రూ.80 లక్షలకుపైగా ఖర్చు
- నిబంధనలు అతిక్రమణ
-చర్చనీయాంశమైన జివిఎంసి తీరు



జాహ్నవి నివాసముంటున్న బంగ్లా ఇదే..

ప్రజాశక్తి - అనకాపల్లి ప్రతినిధి

అనకాపల్లి జిల్లా కేంద్రంలోని సుంకరమెట్ట జంక్షన్‌కు అతి సమీపంలో కలెక్టరేట్‌కు వెళ్లే రహదారి పక్కన వుడా లే అవుట్ పార్కు స్థలంలో రూ.80 లక్షలకు పైగా ఖర్చుచేసి జివిఎంసి నిర్మించిన విలాసవంతమైన బంగ్లాలో జాయింట్ కలెక్టర్ జాహ్నవి వుండడం చర్చనీయాంశమవుతోంది. ప్రజలకు ఉపయోగపడాల్సిన పార్కు స్థలంలో శాశ్వత నిర్మాణం చేపట్టకూడదన్న స్పృహ జివిఎంసికి లోపిస్తే, ఏ నిబంధనలూ పాటించకుండా నిర్మించిన బంగ్లాను తాను వినియోగించకూడదన్న విజ్ఞత ఐఎఎస్ అధికారైన జాయింట్ కలెక్టర్ జాహ్నవికి కొరవడింది. ఇది చివరకు వివాదస్పద అంశంగా మారింది. సబ్బవరంలోని అత్యంత విలాసవంతమైన ఒక ప్రయివేటు భవనంలో అద్దెకు వున్న కాలంలో ప్రభుత్వ భూముల ఆక్రమించినట్లు ఇంటి యజమానిపై వచ్చిన ఫిర్యాదులపై జాహ్నవి మౌనంగా వున్నారన్న విమర్శలున్నాయి. ఇవిలా కొనసాగుతుండగానే సుంకరమెట్ట వద్ద లే అవుట్ పార్కు స్థలంలో నిర్మించిన సువిశాల బంగ్లాను ఉపయోగించుకోవడంతో గతంలో ఏ ఐఎఎస్ అధికారిపైలేని విమర్శలు జాహ్నవి ఎదుర్కొంటున్నారు.

ప్రజల ఆస్తులు, వనరులు పరిరక్షించే బాధ్యతకల్గిన అధికారే... తన సౌలభ్యం కోసం విధి ధర్మాన్ని విడిచిపెట్టారన్న వ్యాఖ్యలు వినబడుతున్నాయి. ఎస్‌బిఐ కాలనీ, సర్వే నెంబర్ 1551, 1558/5లోని ఎల్‌పి నెంబరు 2/83 లే అవుట్‌లో పార్కుకు 22 సెంట్లు 1983లో కేటాయించారు. అప్పటినుంచి ఖాళీగావున్న ఈ స్థలంలో జివిఎంసి కమిషనర్ కోసం బంగ్లా నిర్మించాలని అధికారులు భావించారు. రూ.80 లక్షల విలువైన భవన నిర్మాణానికి జివిఎంసి పాలకవర్గ అనుమతి అవసరం లేకుండా పనులను ముక్కముక్కలుచేసి విలాసవంతమైన భవనం నిర్మించారు. పార్కు స్థలంలో ప్లాన్ లేకుండా నిర్మించిన భారీ భవనం విషయం బయటకు పొక్కకుండా నిర్మాణ పనులన్నీ పూర్తయ్యాక జాయింట్ కలెక్టర్ జాహ్నవి దంపతులు గృహ ప్రవేశం చేశారు.

సమాచార హక్కు చట్టంతో ఈ రహస్యాలు, ఉల్లంఘనలు వెలుగుచూశాయి. సమాధానం చెప్పకోలేని పరిస్థితి అధికారులకు ఏర్పడింది. తలదాచుకోవడానికి ఓ గది నిర్మించుకొనే సామాన్యుల నిర్మాణాలను ప్లాన్ లేదని కూల్చే జివిఎంసి అధికారులు, పార్కు స్థలంలో బంగ్లా ఎలా నిర్మిస్తారన్న ప్రశ్నకు వారి వద్ద సమాధానంలేదు. నిర్మాణ అనుమతుల్లేని భవనానికి విద్యుత్ మీటర్ ఇవ్వకూడదని తెలిసినా, ఆ బంగ్లాలో వుండేది ఎపిఇపిడిసిఎల్ సిఎమ్‌డి పృథ్వీతేజ్ భార్య జాయింట్ కలెక్టర్ జాహ్నవి కావడంతో కళ్లుమూసుకొని అధికారులు విద్యుత్ మీటర్ మంజూరు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా చేపడుతున్న భవన నిర్మాణ పనులు నిలిపివేయాలని నిర్మాణ సమయంలో కార్పొరేటర్లు, సామాజిక కార్యకర్తలు ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లినా వారు స్పందించలేదు. అనకాపల్లి వచ్చినప్పుడు జివిఎంసి కమిషనర్ విశ్రాంతి తీసుకోవడానికి బంగ్లా కట్టామని, ప్రస్తుతం జాయింట్ కలెక్టర్‌కు కేటాయించామని జివిఎంసి అధికారులు చెబుతున్నారు. అయితే, బంగ్లా నిధులు, ఖర్చుకు సంబంధించిన పూర్తి వివరాలు చెప్పడానికి ఇష్టపడలేదు. జాయింట్ కలెక్టర్ వివరణ కోసం ప్రయత్నించగా ఆమె స్పందించలేదు.

పార్కును అభివృద్ధి చేయాలి

పార్కు స్థలంలో ప్లాన్ లేకుండా భవన నిర్మాణం చేపట్టిన జివిఎంసి అధికారులపై చర్యలు తీసుకొని, నిబంధనలకు విరుద్ధంగా చేసిన వ్యయం వారి నుంచి రాబెట్టి ప్రభుత్వ ఖజానాకు జమ చేయాలి. యధావిధిగా పార్కు స్థలాన్ని అభివృద్ధి చేయాలి. పార్కును అభివృద్ధి చేయకపోతే న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాను.




- కాండ్రేగుల వెంకటరమణ, సమాచార హక్కు చట్టం కార్యకర్త



స్థలాన్ని పరిశీలిస్తున్న తహశీల్దార్

ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే చర్యలు

ప్రజాశక్తి -కోటవురట్ల: మండలంలోని సుంకపూరు గ్రామంలో గెడ్డ పోరంబోకు ఆక్రమణపై పి జి ఆర్ ఎస్ లో జనసేన పార్టీ మండల అధ్యక్షులు సింగంపల్లి శ్రీనివాస్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు తహసిల్దార్ తిరుమల బాబు రెవెన్యూ సిబ్బంది విచారణ చేపట్టారు, సర్వే నంబరు 202లో 1.65 ఎకరాల గడ్డ పోరంబోకులో 24 సెంట్లు ఆక్రమించుకున్నట్లు గుర్తించామని ఆయన తెలిపారు. ఈ మేరకు ఆక్రమణదారులకు నోటీసులు అందజేస్తామని ప్రభుత్వ స్థలాలు ఆక్రమిస్తే ఎంతటి వారినైనా ఉపేక్షించేది లేదన్నారు. ఈ కార్యక్రమంలో మండల సర్వేయర్ శ్రీనివాస్, విలేజ్ సర్వేయర్లు పాల్గొన్నారు.



ఎన్నికైన నాయకులు

టిడిపి గ్రామ కమిటీల ఎన్నిక

ప్రజాశక్తి- మాడుగుల: మాడుగుల మండలంలో పలు గ్రామాల్లో గ్రామ శాఖ అధ్యక్ష, కార్యదర్శులను ఎన్నుకోవడం జరిగిందని టిడిపి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు, మండల అధ్యక్ష కార్యదర్శులు అద్దేపల్లి జగ్గారావు, ఉండూరు దేముడు తెలిపారు. మాడుగుల మండలంలో గాదిరాయి గ్రామ అధ్యక్షుడిగా అనపగడ్డ అప్పారావు ఎన్నుకోగా, ఎం.కె వల్లాపురం గ్రామ శాఖ అధ్యక్షుడిగా మజ్జి శ్రీను, ఉపాధ్యక్షుడిగా మజ్జి నాయుడు, ప్రధాన కార్యదర్శిగా కోట్ని రామాంజనేయులను ఎన్నుకున్నారు. ఎం.కోటపాడు గ్రామ శాఖ అధ్యక్షుడిగా పిల్ల గంగునాయుడు, ప్రధాన కార్యదర్శిగా పేలూరి రాముని ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో మండల యూత్ అధ్యక్షులు రాజ్ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ పుప్పాల రమేష్, గాదిరాయి సర్పంచ్ పెంటకోట జగన్నాధం, టిడిపి నాయకులు పాల్గొన్నారు.



అన్న సమారాధనలో పాల్గొన్న భక్తులు

ఘనంగా ఆలయ వార్షికోత్సవం

ప్రజాశక్తి-మాడుగుల: మాడుగులలో షిరిడి సాయిబాబా ఆలయ 26వ వార్షికోత్సవ వేడుకలు శనివారం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఘనంగా జరిగాయి. ఉదయం 5 గంటల నుంచి అభిషేకాలు, వ్రతాలు నిర్వహించారు. మధ్యాహ్నం ఆలయం వద్ద అన్న సమారాధన నిర్వహించారు. సాయంత్రం శ్రీ సాయి పారాయణం, పల్లకి సేవ అనంతరం గ్రామ సంకీర్తన వంటి కార్యక్రమాలు నిర్వహించారు.

రైతులకు వ్యవసాయ పనిముట్ల పంపిణీ

ప్రజాశక్తి-అనంతగిరి: మండలంలోని టోకూరు, కోనపురం పంచాయతీకి చెందిన రైతులకు వ్యవసాయ పనిముట్లను సర్పంచులు కిల్లో. మొస్య, అప్పలమ్మలు శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భ ంగా వారు మాట్లాడుతూ, వ్యవసాయ పనులలకు దుక్కెటద్దులు లేని రైతులను గుర్తించి ఏడు పవర్ ఈడర్లను అందజే యడం జరిగిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ సార దొన్ను, నాయకులు జి.రఘునాథ్ పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధి హామీ కూలీ మృతి

ప్రజాశక్తి-రావికమతం: మండలంలో మరుపాక పంచాయతీ శివారు నాగన్నపాలెం గ్రామానికి చెందిన ఉపాధి హామీ కూలీ గొర్లె సత్తిబాబు గుండె పోటుతో శనివారం మృతి చెందాడు. మరుపాక పంచాయతీ శివారు రాయవరం పొర్లు కొట్టు నుండి దాసరయ్యపాలెం చెక్ డాం వరకు ఫీడర చానల్ పనులు చేస్తూ ఉండగా గొర్లె సత్తిబాబు కు అకస్మాత్తుగా గుండెపోటు రావడంతో క్రింద కూర్చుండి పోయాడు. గుర్తించిన మిగిలిన ఉపాధి శ్రామికులు ఆయనను ఇంటికి తరలించారు. కుటుంబ సభ్యులు ఆయనను రావికమతం ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అప్పటికే ఆయన పరిస్థితి విషమించి విషమించి మృతి చెందాడు.



రోధిస్తున్న కుటుంబ సభ్యులు

విద్యార్థులకు అభినందనలు

ప్రజాశక్తి :రావికమతం: ఇటీవల టెన్త్, ఇంటర్ ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాదించిన కేజీబీవీ పాఠశాల విద్యార్థినిలను అనకాపల్లి జిల్లా కలెక్టర్ అభినందించారు. అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో రావికమతం మండలం గర్నికం పాఠశాల విద్యార్థులను జిల్లా కలెక్టర్ అభినందించారు. ఈ సందర్భంగా రావిక మతం మండలం గర్నికం కేజీబీవీ పాఠశాల ఎస్.ఓ ఎల్.ఎల్ బాను ఉమా మాట్లాడుతూ, కేజీబీవీ పాఠశాలలో ఇంటర్ 950 మార్కులు దాటిన వారిని, 10వ తరగతిలో 550 మార్కులు దాటిన విద్యార్థులకు అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ కృష్ణన్ చేతుల మీదుగా సర్టిఫికెట్, మెమొంటోలను అందజేసి అభినందించినట్లు ఆమె తెలిపారు.



మహాలక్ష్మినాయుడికి సర్టిఫికెట్ ఇస్తున్న కలెక్టర్

ప్రత్యేక ఉపాధ్యాయునికి స్పెషల్ ఒలింపిక్ కోచ్ సర్టిఫికెట్ ప్రదానం

ప్రజాశక్తి-రావికమతం: అనకాపల్లి జిల్లా నుండి ఇరువురు దివ్యాంగ విద్యార్థులు జాతీయ స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక కావడానికి ప్రత్యేక తర్ఫీదునిచ్చి కృషి చేసిన మేడివాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రత్యేక ఉపాధ్యాయుడు బొడ్డు మహాలక్ష్మి నాయుడును అనకాపల్లి జిల్లా కలెక్టర్ విజయ్ కష్ణన్ సత్కరించారు. అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో శనివారం స్పెషల్ ఒలంపిక్ భారత్ కోచ్ సర్టిఫికెట్ అందించి ఆయనను అభినందించారు. అలాగే ప్రత్యేక ఉపాధ్యాయుడు మహాలక్ష్మి నాయుడిని అనకాపల్లి జిల్లా విద్యాశాఖ, సమగ్ర శిక్ష అధికారులు జి.అప్పారావు నాయుడు, డాక్టర్ ఆర్ జయప్రకాష్, సమగ్ర శిక్ష జిల్లా సహిత విద్య సమన్వయకర్త బి.శకుంతలు శాలువాతో ఘనంగా సత్కరించారు. జిల్లా సహిత విద్యా సమన్వయకర్త శకుంతల మాట్లాడుతూ, మహాలక్ష్మి నాయుడు అంకితభావంతో పని చేస్తూ దివ్యాంగ విద్యార్థుల అభ్యున్నతికి సహాయ సహకారాలు అందించడం చాలా ఆనందదాయకమని ప్రశంసించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధికారులు, దివ్యాంగ విద్యార్థుల తల్లిదండ్రులు, ప్రత్యేక ఉపాధ్యాయులు పలువురు పాల్గొన్నారు.

ప్రజాభిప్రాయ సేకరణ గ్రామ సభ వాయిదా

ప్రజాశక్తి-జీకే.వీధి: మండలంలోని పెదవలస పంచాయతీ డోకులూరు గ్రామంలో లేట్ రైట్ మైనింగ్ తవ్వకాల కోసం శనివారం ఏర్పాటు చేసిన ప్రజాభిప్రాయ సేకరణ (పబ్లిక్ హియరింగ్) గ్రామసభ మన్యం బంద్ కారణంగా వాయిదా పడింది. ఈ సభకు వచ్చిన గూడెం కొత్త వీధి తహసిల్దార్ రామకృష్ణ మాట్లాడుతూ, బంద్ కారణంగా అధికారులు రాకపోవడంతో తాత్కాలికంగా వాయిదా వేస్తున్నామని తెలిపారు.

ఈదురు గాలులతో వర్ష బీభత్సం



మాడుగులలో రోడ్డుపై కూలిన చెట్టు

నేల కొరిగిన విద్యుత్ స్తంభాలు, చెట్లు

ప్రజాశక్తి -నక్కపల్లి: మండలంలోని శనివారం సాయంత్రం ఈదురుగాలులతో వర్షం బీభత్సం సృష్టించింది. సాయంత్రం ఒక్కసారిగా ఆకాశంలో కారు మబ్బులు కమ్ముకుని ఉరుములు, మెరుపులతో, ఈదురు గాలులతో వర్షం విరుచుకుపడింది. దీంతో పలుచోట్ల విద్యుత్ స్తంభాలు, చెట్లు నేలకొరిగాయి. నక్కపల్లి లో మోటమర్రి సత్రం వద్ద చెట్టు విరిగి పలు షాపులపై పడ్డాయి. వైసిపి కార్యాలయం, టైలరింగ్ షాపు తోపాటు పలు షాపులు దెబ్బతిన్నాయి. విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. మత్స్యకార గ్రామమైన రాజయ్యపేటలో విద్యుత్ స్తంభం, కొబ్బరి చెట్టు విరిగి పోయాయి. విద్యుత్ స్తంభం విరిగి, విద్యుత్ వైర్లు నేలకు వేలాడడంతో గ్రామస్తులు తీవ్ర భయందోళన చెందారు. పలు గ్రామాల్లో విద్యుత్తు స్తంభాలు, చెట్లు నేల కొరిగాయి. దీంతో, విద్యుత్ సరఫరాకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈదురు గాలులకు పలుచోట్ల మామిడికాయలు నేల రాలాయి.

మాడుగుల: ఘాటిరోడ్డు, పాడేరు వెళ్లే ప్రధాన రహదారిలో ఈదురుగాలుల వర్షం ధాటికి శనివారం రోడ్డుకి అడ్డంగా చెట్లు పడిపోవడంతో ట్రాఫికికి తీవ్ర అంతరాయం కలిగింది. స్పందించిన ఎంపీపీ తాళ్లపురెడ్డి వెంకటరాజారామ్ కూలీలతో రోడ్డుకి అడ్డంగా పడిన చెట్లను తొలగించి ట్రాఫిక్ కి అంతరాయం లేకుండా చేశారు. మాడుగుల, ఎం. కోడూరు, సురవరం గ్రామాల పరిధిలో చెట్టు కొమ్మలు విరిగి విద్యుత్తు వైర్లపై పడటంతో స్తంభాలు నేల కొరిగాయి. విద్యుత్తు సరఫరాను పునరుద్ధరించామని ఏఈఈ రాంబాబు తెలిపారు.

.బుచ్చయ్యపేట : మండలంలోని పలు గ్రామాల్లో శనివారం భారీ వర్షం కురిసింది. మధ్యాహ్నం ఒంటిగంట వరకు అధిక ఉష్ణోగ్రతలతో ఎండ కాసింది. ఆ తర్వాత ఒక్కసారిగా వాతావరణం చల్లబడి ఈదురు గాలులు, ఉరుములతో కూడిన భారీ వర్షం దంచి కొట్టింది. వర్షం కారణంగా దిబ్బిడి, బుచ్చయ్యపేట, రాజాం, వడ్డాది, బంగారుమెట్ట కూడళ్లు జలమయమయ్యాయి. పలు గ్రామాల్లో నీరు రోడ్లపై ప్రవహించింది.



కూలిన పెంకుటిళ్లు

కోటవురట్ల: మండలంలో కైలాసపట్నం గ్రామంలో శనివారం సాయంత్రం కురిసిన అకాల వర్షానికి రెండు పెంకుటిళ్లు కూలిపోయాయి. కుందూరు అప్పన్న, కుందూరు నాగేశ్వరరావులకు చెందిన పెంకిటిల్లు కూలి పోవడంతో నిరాశ్ర యులయ్యారు. సుమారు 40 సంవత్సరాల క్రితం ఇందిరమ్మ కాలనీలో ఇచ్చిన ఇల్లు కావడంతో కురిసిన వర్షానికి కూలి పోయాయి అధికారులు స్పందించి న్యాయం చేయాలని ఎదురు చూస్తున్నారు



నిరాశ్రయులైన వృద్ధులు

పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి- నక్కపల్లి: 90 శాతం రాయితీపై అందిస్తున్న వ్యవసాయ పథకాలను గిరిజన రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్ అన్నారు. మండలంలోని గిరిజన గ్రామమైన చీడికలో శనివారం దర్తీ అబా జన్ జాతీయ గ్రామ్ ఉత్కర్ష అభియాన్ కార్యక్రమంలో భాగంగా గిరిజన రైతులతో సమావేశం నిర్వహించారు. గిరిజన రైతులు, సామాజిక ఆర్థిక అభివృద్ధి మెరుగుపరచడం కోసం వ్యవసాయ శాఖలో అమలవుతున్న పథకాలను 90 శాతం రాయితీతో అందివ్వడం జరుగుతుందన్నారు. వ్యవసాయ శాఖ లో అమలవుతున్న మట్టి నమూనాలు, పచ్చి రొట్ట విత్తనాలు, వ్యవసాయ యాంత్రీకరణ ,వేసవిలో వేసే అపరాలు, పిఎం కిసాన్, ఎరువులు ,విత్తనాలు, ఏపీఎఫ్ఆర్ గురించి రైతులకు వివరించారు.



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్

ఈ కార్యక్రమంలో ఏఈ ఓ సాయి కుమారి, ఆర్ఎస్కె సిబ్బంది శిరీషా,రజిత, సురేంద్ర, రైతులు పాల్గొన్నారు

మన్యం బంద్ సక్సెస్

ఆదివాసీ స్పెషల్ డిఎస్సి కోసం పట్టుబిగించిన గిరిజనం

ప్రజాశక్తి - పాడేరు: స్పెషల్ డిఎస్సి సాధన కోసం చేపట్టిన తలపెట్టిన రాష్ట్ర వ్యాప్త మన్యం బంద్ రెండో రోజైన శనివారమూ అదే ఉద్యమ స్ఫూర్తితో కొనసాగింది. మన్యప్రాంతం పూర్తిగా స్తంభించింది జనసంచారం నిలిచిపోయింది. వాహనాలు కదల్లేదు. పాడేరు పట్టణంలో స్పెషల్ డిఎస్సి సాధన కమిటీ ప్రతినిధులు సెంటెన్స్ కాన్వెంట్ జంక్షన్ వద్ద, ఐటీడీఏ వద్ద రోడ్లపై బైఠాయించారు. మార్కెట్లు పూర్తిగా బంద్ అయ్యాయి. చెక్ గేట్ వంట్లమామిడి, మినుములూరు ప్రాంతాల్లో వంటా వార్పు కార్యక్రమాలు నిర్వహించారు. స్పెషల్ డిఎస్సి ప్రకటించాలని, ప్రభుత్వం స్పందించే వరకు తమ ఆందోళన ఆగదని రోడ్లపై బైఠాయించి నినదించారు. ఆదివాసీ అధికార్ రాష్ట్రీయ మంచ్ జాతీయ సభ్యులు అప్పలనర్స, అరుకు ఎంపీ తనుజరాణితోపాటు పాడేరు, అరకు మాజీ ఎమ్మెల్యేలు కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, శెట్టి ఫాల్గుణ బంద్‌లో పాల్గొని రోడ్డుపై బైఠాయించారు.

అరకులోయ రూరల్: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అరకులో రా కదలిరా ఎన్నికల సభలో గిరిజనులకు వంద శాతం ఉద్యోగ అవకాశాలు కల్పించే బాధ్యత టీడీపీ ప్రభుత్వం తీసుకుంటుందని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన తరువాత మాట మార్చడం ఎంతవరకు సమంజసమని ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర ప్రశ్నించారు. శనివారం ఆదివాసి స్పెషల్ డీఎస్సీ సాధన కమిటీ, అఖిలపక్షం ప్రజాసంఘాలు ఆధ్వర్యంలో చేపట్టిన రెండోవ రోజు



అరకులోయలో నిరసన చేపడుతున్న నాయకులు



పాడేరులో బోసిపోయిన ఆర్‌టిసి కాంప్లెక్స్

బంద్ కొనసాగింది. దీంతో, ప్రముఖ పర్యాటక కేంద్రాలు పద్మావతి గార్డెన్, గిరిజన మ్యూజియం, కాఫీ మ్యూజియం మూతబడ్డాయి. వాహనాలు రాకపోకలు నిలిచిపోయయి. వ్యాపార సముదాయం మూతపడ్డాయి. రోడ్లన్నీ నిర్మానుష్యంగా మారాయి. ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకులోయ మండల కేంద్రంలోని రెండో రోజు బందుకు మద్దతుగా ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆదివాసి గిరిజన సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిల్లో సురేంద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వంజి ఓ నెం పునరుద్ధరణ చేసి ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఆదివాసీ ప్రాంతాల్లో డిగ్రీలు, బీఈడీ, పీజీలు చదివి వేలాది సంఖ్యలో ఆదివాసి నిరుద్యోగులు ఉన్నారన్నారు.చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీలు అమలు చేయకపోతే భవిష్యత్తులో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి గిరిజనులు చెబుతారని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వి ఉమామహేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు ఎల్బీ పోతురాజు, ఎస్ఎఫ్ఐ జిల్లా నాయకుడు జీవన్, ఆదివాసి పరిరక్షణ సమితి అధ్యక్షుడు మోహన్, డిఎల్ఓ నాయకులు ప్రసన్నకుమార్, ఆదివాసి గిరిజన సంఘం నేతలు జగన్నాథం, మగ్గన్న, సహదేవ్, డీఎస్సీ సాధన కమిటీ నాయకులు రమేష్, వెంకట్, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న శచీదేవి

గ్రామీణ అభివృద్ధిపై సమీక్ష

ప్రజాశక్తి -కోటవురట్ల: విజన్ 2047 అభివద్ధి ప్రణాళికలో భాగంగా శనివారం జిల్లా గ్రామీణ అభివృద్ధి అధికారి శచీదేవి మండల స్థాయి అధికారులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంతాల్లో అభివృద్ధి ప్రణాళికలతో పాటు ప్రధాన సమస్యలపై అధికారులను అడిగి తెలుసుకున్నారు. గ్రామీణ రహదారులు, మౌలిక వసతులు అడిగి తెలుసుకోవడంతో పాటు గ్రామీణ ప్రాంతాల్లో తలసరి ఆదాయం పెంచే విధంగా విజన్ యాక్షన్ ప్లాన్ పట్ల సమీక్ష నిర్వహించా మన్నారు. ఈ సందర్భంగా స్థానిక విలేకరులు మండల కేంద్రంలో సీతారామరాజు నగర్ కాలనీ, ప్రధాన రహదారి మురికి కూపంగా దర్శనమిస్తుందని అడిగిన ప్రశ్నకు సమాధా నంగా ఆమె మాట్లాడుతూ, సమస్యలన్ని గుర్తించి పరిష్కరించే దిశగా చర్యలు తీసుకుంటామన్నారు ఈ కార్యక్రమంలో ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు, జానకి శ్రీను, పలువురు మండల అధికారులు పాల్గొన్నారు.



అనుమతి కోరుతున్న మాజీ ఎమ్మెల్యే

జూన్ 4న శాంతియుత ర్యాలీ

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్: కూటమి ప్రభుత్వం వైఖరికి నిరసనగా నర్సీపట్నంలో జూన్ 4న శాంతియుత ర్యాలీ నిర్వహిస్తున్నట్లు మాజీ ఎమ్మెల్యే పెట్ల ఉమా శంకర్ గణేష్ మీడియాకు శనివారం తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఏర్పడి సంవత్సరం పూర్తిగా వస్తున్నప్పటికీ నేటి వరకు ప్రజలకు అందిస్తానన్న సూపర్ సిక్స్ పథకాలను నేటికీ అమలు చేయలేదన్నారు. ఈ నేపథ్యంలో శాంతియుత ర్యాలీ నిర్వహించేందుకు అనుమతిని కోరుతూ ఎఎస్పీకి వినతి పత్రాన్ని అందించినట్లు తెలియజేశారు. ఇందులో భాగంగానే ర్యాలీ నిర్వహిస్తున్నట్లు తెలిపారు.